# చైతన్యరథం


సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

8




# 'క్వాంటం'లో ఏపీ లీడ్ రోల్

- రాష్ట్రంలో క్వాంటం స్కిల్ రోడ్ మ్యాప్ సిద్ధం
- రెండేళ్లల్లో అమరావతినుంచే క్వాంటం పరికరాల ఉత్పత్తి
- క్వాంటం విజన్‌ను, విప్లవాన్ని అందిపుచ్చుకోండి
- ఈ టెక్నాలజీతో నోబెల్‌స్థాయికి మన పరిశోధనలు చేరాలి
- "క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్"లో చంద్రబాబు లెక్చర్
- వివిధ అంశాలపై టెకీ స్టూడెంట్స్‌కు సీఎం ప్రజెంటేషన్

2

*సిలికాన్ వ్యాలీ డిజిటల్ యుగాన్ని రూపొందించినట్టే.. అమరావతిలోని క్వాంటం వ్యాలీ భవిష్యత్తులోని లోతైన సాంకేతిక ఆర్థిక వ్యవస్థకు లంగరు వేయనుంది. ప్రపంచంలోనే అతి పెద్దదైన వైజర్ -క్యుబిటెక్-కృషి క్వాంటం ప్రోగ్రామ్‌లోని విద్యార్థులతో తరగతి గదిలోకి అడుగుపెట్టి సంభాషించడం ఆనందంగా ఉంది. భారతదేశం, ప్రపంచం ఉజ్వల భవిష్యత్‌కు అవసరమయ్యే క్వాంటం వర్క్‌ఫోర్స్‌ను ఏపీ నిర్మిస్తున్నందుకు గర్వంగానూ ఉంది*

-ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు

## యువతలో నైపుణ్యం పెంచేలా..

క్వాంటం టెక్నాలజీ కోర్సులపై సీఎం చంద్రబాబు

3

పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్

ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో భేటీలో స్పష్టీకరణ





సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్-2026

## పోస్టర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాకెట్ తయారీ పోటీలు

3

జనవరి 22నుంచి 24 వరకు గుంటూరు విజ్ఞాన్‌లో ఫైనల్స్


## అసెంబ్లీ సెక్రటేరియట్-2026 క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన సీఎం



జీవ వైవిధ్యం- ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం థీమ్‌తో క్యాలెండర్

3

పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి పయ్యావుల



## ధాన్యం కొనుగోలులో అప్రమత్తం

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి
- మామిడి రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు సహకరించాలి
- ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే పల్ప్ యూనిట్లపై కఠిన చర్యలు
- ధాన్యం కొనుగోలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సమీక్షలో సీఎం ఆదేశం

4

'పల్లె వెలుగు'లైనా..

## ఈవీలన్నీ ఏసీలే!



- వచ్చే ఏడాది కొత్తగా 1,450 ఎలక్ట్రిక్ బస్సులు
- కేంద్రంనుంచి రానున్న మరో 1,050 ఈవీలు
- పుష్కరాలకు గోదావరి జిల్లాల్లో ముందుగా ఛార్జింగ్ స్టేషన్లు
- ఏపీఎస్ ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం

4




5

## సంగీత సాహిత్య సంస్కృతులే భారతీయ సంపదకు మూలాలు

- అన్నమయ్య సంకీర్తనలను ప్రజలకు చేరువ చేస్తున్న శోభారాజు
- అలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది
- 'తందనానా' విజేతలకు పతకాల పంపిణీలో సీఎం చంద్రబాబు

## ఆందోళనకర స్థాయిలో రోడ్డు ప్రమాదాలు

- కఠినంగా ట్రాఫిక్ నిబంధనల అమలు
- హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరణ
- రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా రాష్ట్రస్థాయి రోడ్డు భద్రతా కార్యక్రమం
- పాల్గొన్న మంత్రులు ఆనం, అనగాని, ఉన్నతాధికారులు

7

## చెత్త నుంచి విద్యుదుత్పత్తి

- నాలుగు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లతో పీపీఏలు
- ఘన వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం
- పురపాలక మంత్రి నారాయణ

6

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థుల భవిష్యత్తుకు మంత్రి లోకేష్ బాటలు
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి
- బాపట్లలో ఉన్నత పాఠశాల భవనం ప్రారంభం

8

## వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

- అటవీ మార్గాల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు
- వేర్వేరు ఘటనల్లో ఒకేరోజు ఆడ పులి, చిరుత మృతి దురదృష్టకరం
- రెండు ఘటనలపై తక్షణం విచారణ జరిపి నివేదిక ఇవ్వండి
- అటవీశాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం

8

## ఆర్థిక సంస్కరణల శిల్పి పీవీ నరసింహారావు

- ఆయన ఆశయాలు దేశాభివృద్ధికి మార్గదర్శకాలు
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి

6

## సీఎం చంద్రబాబు హామీ.. 24 గంటల్లోపే ఉత్తర్వులు

- పాస్టర్ల గౌరవ వేతనాలకు రూ.50.04 కోట్లు విడుదల
- 8427 మంది పాస్టర్లకు లబ్ది
- సీఎం చంద్రబాబుకు మైనారిటీ మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు

8

## గుంతలు లేని రోడ్లే ప్రభుత్వ లక్ష్యం


- జనవరిలోగా మరమ్మతులు పూర్తి
- పీపీపీ, హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతుల్లో అభివృద్ధి
- టోల్ విధానంపై జరుగుతోంది దుష్ప్రచారమే
- ఆర్అండ్‌బీ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి

7

చైతన్యరథం

# ‘క్వాంటం’లో ఏపీ లీడ్ రోల్

- రాష్ట్రంలో క్వాంటం స్కిల్ రోడ్ మ్యాప్ సిద్ధం
- రెండేళ్లల్లో అమరావతినుంచే క్వాంటం పరికరాల ఉత్పత్తి
- క్వాంటం విజన్‌ను, విప్లవాన్ని అందిపుచ్చుకోండి
- ఈ టెక్నాలజీతో నోబెల్‌స్థాయికి మన పరిశోధనలు చేరాలి
- “క్వాంటం టాక్ బై సీఎం సీబీఎన్”లో చంద్రబాబు లెక్చర్
- వివిధ అంశాలపై టెకీ స్టూడెంట్స్‌కు సీఎం ప్రజెంటేషన్




అమరావతి (చైతన్య రథం): భారత్ దేశంలో క్వాంటం టెక్నాలజీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం సహా దాని అనుబంధ రంగాల్లో నిపుణులను తయారు చేసేలా తాము కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఏపీ ప్రభుత్వం, వైసర్, క్యూబిట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన క్వాంటం ప్రోగ్రామ్‌లో భాగంగా వేలమంది టెక్ విద్యార్థులతో ముఖ్యమంత్రి ‘క్వాంటం టాక్ బై సీబీఎన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి నిర్వహిస్తున్న అతిపెద్ద శిక్షణా కార్యక్రమంలో డిజిటల్ మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇచ్చిన విజన్‌ను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్వాంటం ప్రోగ్రామ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న వేలమంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే అమెరికానుంచి వైసర్ సంస్థ ప్రతినిధులు, క్యూబిట్, ఐబీఎం సంస్థల ప్రతినిధులతోపాటు ఆంధ్రా యూనివర్సిటీ సహా వేర్వేరు ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు పెద్దఎత్తున హాజరయ్యారు. క్వాంటం మెకానిక్స్, అల్గారిథమ్స్‌లాంటి అంశాల్లో 10 లక్షలమంది నిపుణుల్ని, క్వాంటం సాఫ్ట్వేర్, హార్డ్‌వేర్ రంగాల్లో 3 లక్షల మందిని, అడ్వాన్స్‌డ్ రీసెర్చిలో లక్షమంది నిపుణుల్ని తయారు చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ “ఐటీ విప్లవం అందిపుచ్చుకుని ఉమ్మడి ఏపీలో ఐటీ నిపుణుల్ని తయారు చేసి ప్రపంచానికి అందించాం. సైబరాబాద్ నిర్మాణం ద్వారా హైదరాబాద్ ఐటీ గ్లోబల్ హబ్‌గా ఎదిగింది. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ కృష్ణలాంటి భారతీయులే గూగుల్, మైక్రోసాఫ్ట్‌లాంటి దిగ్గజ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్నారు. విశాఖలోనూ ఇప్పుడు గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. గతంలో ఐటీఈఎస్‌లాంటి సేవల్ని వివిధ దేశాలకు ఇక్కడి నుంచే అందించాం. విశాఖ ఇప్పుడు డేటా సెంటర్లకు గ్లోబల్ హబ్‌గా మారుతోంది. ఇక్కడి నుంచే సబ్ సీ కేబుల్‌లాంటి వ్యవస్థ సైతం ఏర్పాటవుతోంది. అమరావతి నాలెడ్జి ఎకానమీ, క్వాంటం వ్యాలీగా ఉంటుంది. తిరుపతి స్పేస్ సిటీగా నిర్మితమవుతుంది. అనంతపురం, కడపలాంటి ప్రాంతాలు ఎలక్ట్రానిక్స్ ఏరో స్పేస్ కేంద్రాలుగా ఉంటాయి. విశాఖ- చెన్నై, చెన్నై- బెంగుళూరు, బెంగుళూరు- హైదరాబాద్ కారిడార్లు అతిపెద్ద పారిశ్రామిక కారిడార్లుగా మారుతున్నాయి. ఏపీని క్వాంటంతోపాటు గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తున్నాం. వచ్చే 20 ఏళ్లలో చేపట్టాల్సిన రాష్ట్రాభివృద్ధికి ఇప్పుడే కార్యరూపం ఇస్తున్నాం. అమరావతిలో క్వాంటం వ్యాలీ ద్వారా ఎకో సిస్టమ్‌ను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. భారత్‌లో నైపుణ్యాలు ఉన్నప్పటికీ, క్వాంటం రంగంలో మరింత పెట్టుబడులు రావాల్సి ఉంది. నేషనల్ క్వాంటం మిషన్ ద్వారా పెద్దఎత్తున ఈ రంగంలో పెట్టుబడులు, నైపుణ్య కల్పనకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఐటీ విప్లవంలాగా ప్రపంచవ్యాప్తంగా క్వాంటం విప్లవాన్ని కూడా భారతీయులు అందిపుచ్చుకోవాల్సి ఉంది. వైద్యం, విద్యుత్, సుస్థిర వ్యవసాయం, ఫైనాన్షియల్ మోడలింగ్, మెటీరియల్స్ డిస్కవరీ, వెదర్ ఫోర్‌కాస్టింగ్‌లాంటి అంశాల్లో క్వాంటం కంప్యూటింగ్ పరిశోధనలు మానవాళికి ఉపకరిస్తాయి. ఏఐ, క్వాంటం, శాటిలైట్, డ్రోన్‌లాంటి టెక్నాలజీలతో వివిధ రంగాల్లో సుస్థిరత సాధించే అవకాశం ఉంటుంది. అతి తక్కువ వ్యయంతోనే ప్రజలకు సేవలు అందించవచ్చు. క్వాంటం టెక్నాలజీ ద్వారా పరిశోధనలకు ఆకాశమే హద్దు” అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## మన పరిశోధనలు నోబెల్‌స్థాయికి చేరేలా..

“ఏపీనుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే వందకోట్లు ఇస్తామని గతంలో ప్రకటించాం. క్వాంటం టెక్నాలజీ ద్వారా దీనిని ఎవరైనా అందిపుచ్చుకుంటే వారికి వంద కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. మన పరిశోధనలు ఆ స్థాయిలో ఉండేలా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఉపకరిస్తుంది. అందుకే అమరావతిలో క్వాంటం ఎకో సిస్టం వచ్చేలా ప్రణాళిక చేశాం. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్, క్యూరేటివ్ హెల్త్‌ను క్వాంటం అప్లికేషన్ల ద్వారా అందించే అవకాశం ఉంటుంది. సామర్థ్యాలు, వేగం, కచ్చితత్వంలాంటివి క్వాంటం టెక్నాలజీ ద్వారా సాధించవచ్చు. వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను క్వాంటం ద్వారా సాధించవచ్చు. ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌ను భారతీయులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఏ సాంకేతికత అయినా, విప్లవమైనా ఏపీ నాయకత్వం వహిస్తుంది. ఎవరినీ అనుసరించదు. క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను కూడా వచ్చే రెండేళ్లలో అమరావతినుంచే ఉత్పత్తి చేస్తాం. క్వాంటం నిపుణులు, క్వాంటం కంప్యూటర్లు, పరికరాలను ఏపీనుంచే ఉత్పత్తి చేసి ప్రపంచానికి అందిస్తాం. క్వాంటం ప్రోగ్రామ్ ప్రకటనకు అనూహ్య స్పందన వచ్చింది. క్వాంటం నిపుణుల్ని తయారు చేసేందుకు ఇచ్చిన ఒక్క ప్రకటన ద్వారా 54 వేలమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్వాంటం నిపుణుల్ని తయారు చేసుకునేలా వారికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. క్వాంటం రంగంలో స్కిల్ రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నాం. లక్షమంది క్వాంటం నిపుణుల్ని తయారు చేసుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. క్వాంటం అల్గారిథమ్స్ నేర్చుకోవటం ద్వారా విద్యార్థులు భవిష్యత్ నిపుణులుగా తయారవుతారు. విజన్‌ను అందిపుచ్చుకోవాలని విద్యార్థులను కోరుతున్నాను. భవిష్యత్తులో అద్భుతమైన ఫలితాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. ఏ అంశంలో అయినా ఏపీ ఫాస్ట్ లెర్నర్. అమరావతిలో క్వాంటం వ్యాలీని అద్భుతంగా నిర్మిస్తున్నాం” అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## మూడు దశాబ్దాల క్రితమే ఐటీ విజన్‌తో విప్లవాత్మక మార్పు

“25 ఏళ్ల క్రితం ఐటీ విజన్ రూపొందించి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. అమెరికాకు సిలికాన్ వ్యాలీలాగే భారత్ క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. విజ్ఞానం భారతీయుల డీఎన్ఏలోనే ఉంది. క్రీస్తు పూర్వం 2500లోనే భారతీయులు అర్బన్ ప్లానింగ్ చేశారు. ఆయుర్వేద, తక్షశిల, నలంద యూనివర్సిటీలు, సిల్క్ రూట్‌లాంటి అంశాలే దీనికి నిదర్శనం. గణితంలో జీరోను, అడ్వాన్స్‌డ్ అస్ట్రానామీలాంటి రంగాల్లో ఎప్పుడో నైపుణ్యాన్ని భారతీయులు సాధించారు. 2 వేల ఏళ్ల క్రితమే ప్రపంచ జీడీపీలో 40 శాతం భారత్‌నుంచే వచ్చేది. ఇప్పుడు 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. హరిత విప్లవం, పారిశ్రామిక విప్లవంకంటే టెక్నాలజీ అందిపుచ్చుకుని సేవలరంగంలో విప్లవం సాధించాం. వైద్యులు, ఇంజనీరింగ్, ఐటీ నిపుణులు ఇతర దేశాలకు వెళ్లి భారతీయుల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, జీఎస్టీలాంటి సంస్కరణలతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయులే. వారిలోనూ ఏపీనుంచి వెళ్లిన వారే ఎక్కువ. ఇప్పుడు మన యువత భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా కనిపిస్తోంది. ప్రధాని మోదీ రూపొందించిన వికసిత్ భారత్ లక్ష్యంతో మనదేశం అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. 30 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. టెక్నాలజీ, ఇన్ఫ్రా డ్రివెన్, సస్టెయినబుల్, ఫ్యూచర్ రెడీ ఎకనామీగా భారత్ ఎదుగుతుంది” అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

కార్యక్రమానికి ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్లు ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ కామకోటి, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్ సహా వివిధ సంస్థల నిపుణులు హాజరయ్యారు. క్వాంటం టెక్నాలజీ ప్రోగ్రామ్‌ను సమర్థంగా నిర్వహిస్తోన్న ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, సీఎంఓ కార్యదర్శి ప్రద్యుమ్నలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు.





చైతన్యరథం

# యువతలో నైపుణ్యం పెంచేలా..




- క్వాంటం టెక్నాలజీ కోర్సులపై సీఎం చంద్రబాబు
- పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్
- ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో భేటీలో స్పష్టీకరణ

అమరావతి (చైతన్య రథం): ఏపీ యువత నూతన నైపుణ్యాల కోసం త్వరలో క్వాంటం టెక్నాలజీ కోర్సులనూ అందించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈమేరకు టెక్ విద్యార్థులు క్వాంటం, ఏఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా వారికి శిక్షణ ఇప్పించడంతోపాటు... పాఠశాల స్థాయినుంచే క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో డిజిటల్ పద్ధతుల ద్వారా విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను ఐఐటీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే ఏడాదినుంచి రెండేళ్లపాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా తయారు చేసిన యాక్షన్ ప్లాన్‌ను ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను సీఎం సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఏపీలోని ప్రతి విద్యార్థికి క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఉండాలి. రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. ప్రైవేట్ విద్యార్థులతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకూ క్వాంటం టెక్నాలజీపట్ల అవగాహన ఉండాలి. 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకోసం పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయండి. దీనికోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి. 2026 జనవరి నెలాఖరులో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తాం. ఆ సమ్మిట్‌లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దాం. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన కలిగించేందుకు ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఉపకరిస్తాయి. అలాగే క్వాంటంలో స్కిల్స్ అప్ గ్రేడ్ చేసుకోవడం కోసం కేంద్రం చేపడుతున్న నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్ అండ్ లెర్నింగ్ వేదికను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. 50 వేలమందికి పైగా టెక్ విద్యార్థులకు క్వాంటం నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

2026 జనవరి నెలాఖరులోగా క్వాంటం టెక్నాలజీలో నైపుణ్యాలు కల్పించేలా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి. వివిధ ఐఐటీలు క్వాంటం విషయంలో చేస్తోన్న అధ్యయనాలను కూడా పరిశీలించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. అలాగే సమావేశంలో ట్రూ 5జీ సేవల విస్తరణపై బీఎస్ఎన్ఎల్ అధికారులతో సీఎం సమీక్షించారు. సమావేశంలో విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులతో పాటు... ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సెక్రటేరియట్-2026

# క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన సీఎం




- జీవ వైవిధ్యం- ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం థీమ్‌తో క్యాలెండర్
- పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి పయ్యావుల

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ప్రచురించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడితో కలిసి సీఎం వాల్ కేలెండర్, టేబుల్ కేలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్,శాసన పరిషత్ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

### జీవ వైవిధ్యం-ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం థీమ్‌తో కేలండర్

జీవవైవిధ్యం- ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం థీమ్‌తో క్యాలెండర్ రూపొందించారు. తూర్పు కనుమలు, విశాలమైన గడ్డి మైదానాలు, కోరింగా మడ అడవులు, సుదీర్ఘ బంగాళాఖాత తీరప్రాంతం... ఇలా ఆంధ్రప్రదేశ్‌లోని విభిన్న ఆవరణ వ్యవస్థలకు చెందిన పన్నెండు వన్యప్రాణుల చిత్రాలతో కేలెండర్ తయారు చేశారు. ప్రకృతి వారసత్వం, కళా సంప్రదాయం, ఆధునికతలను మేళవించారు. సాంప్రదాయ కలంకారీ శైలిలో అత్యంత సుందరంగా చిత్రాలను తీర్చిదిద్దారు. ఈ చిత్రాలు రూపొందించేందుకు ఏఐని వినియోగించామని ప్రసన్నకుమార్ వివరించారు. 2026 సంవత్సర క్యాలెండర్‌ను చక్కగా డిజైన్ చేశారని సీఎం అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలనే మంచి సందేశంతో క్యాలెండర్ ఉందని ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ గురించి క్యాలెండర్ గొప్ప సందేశాన్ని ఇస్తోందని, అలాగే వాతావరణ మార్పుతో కలిగే పరిణామాలనూ వివరిస్తోందని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలనే మన సమిష్టి బాధ్యతను క్యాలెండర్ గుర్తు చేస్తోందన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఉండటం సంతోషించా ల్సిన విషయమని తెలిపారు. స్పీకర్ మాట్లాడుతూ... పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణపట్ల శాసనసభకు ఉన్న నిబద్ధత, వన్యప్రాణులు, ప్రకృతిని కాపాడాల్సిన ఆవశ్యకతపై సమాజాన్ని చైతన్యపరిచేందుకు ప్రజాప్రతినిధుల సభ చేస్తున్న ప్రయత్నంగా 2026 క్యాలెండర్‌ను రూపొందించినట్టు స్పీకర్ తెలిపారు.



## సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్-2026

# పోస్టర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

- సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాకెట్ తయారీ పోటీలు
- జనవరి 22నుంచి 24 వరకు గుంటూరు విజ్ఞాన్‌లో ఫైనల్స్



అమరావతి (చైతన్య రథం): విద్యార్థులు, కాలేజీ యువతలో రాకెట్ల తయారీ నైపుణ్యాలను వెలికి తీసేలా సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ నుంది. దీనికి సంబంధించి సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఫైనల్స్ జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సచివాలయంలో సీఎం ఆవిష్కరించారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రవాణా, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు సీఎంకు వివరించారు. కాలేజీ స్థాయిలో కెమికల్ రాకెట్రీ, పాఠశాల స్థాయిలో హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.కెమికల్ రాకెట్రీ విభాగంలో 16 ఏళ్లకు పైబడిన వారు, హైడ్రో రాకెట్రీ విభాగంలో 6నుంచి 12ఏళ్ల మధ్య వయసున్న వారు పాల్గొననున్నారని తెలిపారు. కళాశాల యువతతోపాటు పాఠశాల విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల్ని, ఆలోచనల్ని వెలికి తీసేలా పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తెలియచేసింది. రిజిస్ట్రేషన్ల కోసం ఏపీ సైన్స్ సిటీ డాట్ గవ్ డాట్ ఇన్ రాకెట్రీ ఛాలెంజ్.. http://www.sciencecity.ap.gov.in/rocketry_challenge.aspx వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.



చైతన్యరథం

# ధాన్యం కొనుగోలులో అప్రమత్తం




- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి
- మామిడి రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు సహకరించాలి
- ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించే పల్ప్ యూనిట్లపై కఠిన చర్యలు
- ధాన్యం కొనుగోలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సమీక్షలో సీఎం ఆదేశం

అమరావతి (చైతన్య రథం): రైతులకు ప్రయోజనం కలిగించేలా రబీ –ఖరీఫ్ –రబీ పంటలకు సంబంధించిన క్యాలెండర్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ, ఉద్యానశాఖలను ఆదేశించారు. దీనికి అనుగుణంగానే పంటల హార్వెస్టింగ్, మార్కెటింగ్ జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ధాన్యం సేకరణ, వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సమీక్ష నిర్వహించారు. వర్చువలుగా మంత్రులు కె అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ సమీక్షకు హాజరయ్యారు.

రబీ– ఖరీఫ్– రబీ సీజన్లలో ఎలాంటి పంటలు వేయాలి.. రైతులకు ఏది ప్రయోజనమన్న అంశాలను రైతుల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. పంట ఉత్పత్తుల నాణ్యత పెంచటంతోపాటు కోత సమయంలోనూ తగిన సూచనలివ్వాలని అన్నారు. కోల్డ్ చైన్ సహా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను తరలించటంతోపాటు ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లకు పంట ఉత్పత్తులను తరలించేలా రైల్ కార్గోలాంటి లాజిస్టిక్స్ సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎదురవుతున్న బ్యాంకు గ్యారెంటీ సమస్యల్ని పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఈమేరకు సమీక్షనుంచే రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కన్వీనర్‌తో ముఖ్యమంత్రి మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే తరహాలో బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వాలని సీఎం బ్యాంకర్లను ఆదేశించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం మేరకు తక్షణమే చర్యలుండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులనుంచి చేసే కొనుగోలులో మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని సీఎం సూచనలు జారీ చేశారు.

### మామిడి రైతులకు ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగిస్తే చర్యలు

ఆర్థిక కష్టాలున్నా మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.184కోట్లను రాయితీగా చెల్లింపులు చేసిందని.. ఏ రాష్ట్రంలోనూ లేనట్టుగా కేజీకి రూ.4 చొప్పున అదనపు ధర చెల్లిస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు రైతులపట్ల ఉదారంగా ఉండాలని సీఎం కోరారు. రైతులను కాపాడుకోవాలనే మామిడికి అదనంగా రూ.4ధర చెల్లిస్తుంటే కొందరుఉద్దేశ పూర్వకంగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టుగా తన దృష్టికి వచ్చిందని... ఇలాంటి చర్యలపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కొందరు వ్యక్తులు, కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లవల్ల రైతులకు ఇబ్బందులు రాకూడదని.. ప్రభుత్వానికి చెడ్డ పేరుతెచ్చేలా ఎవరు వ్యవహరించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు కలిగిన ఇబ్బందులను 10 రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాల్లో మామిడికి ధరలేక మార్కెట్లో ఉన్న ధరకే అక్కడి రైతులు విక్రయించుకోవాల్సి వస్తుందని... అందుకే ఏపీలోని మామిడి రైతులను కాపాడుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందన్నారు. తోతాపురి మామిడి రైతులకు ప్రయోజనం కలిగించేలామరిన్ని ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను తీసుకువచ్చి ఒక ఎకో సిస్టంను తయారు చేస్తున్నామని సీఎం అన్నారు. జనవరిలో ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించాలని ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖను ఆదేశించారు. ప్రస్తుతం పండ్ల ఉత్పత్తిలో దేశంలో ఏపీ నెంబర్ 1గా ఉందని.. ప్రపంచంలోనే అత్యుత్తమ పండ్ల ఉత్పత్తి కేంద్రంగా ప్రకాశం సహా రాయలసీమ జిల్లాలు తయారుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు.

# పార్టీని మరింత బలోపేతం చేస్తా

- ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ
- తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

అమరావతి (చైతన్యరథం): ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానం, ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ శ్రేణులు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఒంగోలు పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించేలా క్షేత్రస్థాయిలో సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతామని, పార్టీని ప్రజల మధ్యకు తీసుకెళ్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబును కలిసినవారిలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితోపాటు ఆయా మండలాల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఉన్నారు.





# 'పల్లె వెలుగు'లైనా.. ఈవీలన్నీ ఏసీలే!

- వచ్చే ఏడాది కొత్తగా 1,450 ఎలక్ట్రిక్ బస్సులు
- కేంద్రంనుంచి రానున్న మరో 1,050 ఈవీలు
- పుష్కరాలకు గోదావరి జిల్లాల్లో ముందుగా ఛార్జింగ్ స్టేషన్లు
- ఏపీఎస్ ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం

అమరావతి (చైతన్య రథం): ఏపీఎస్ ఆర్టీసీలో ఇకపై కొత్తగాప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు'కు చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని స్పష్టంచేశారు. అలాగే,రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ముందుగా ఏర్పాటు చేయాలని... వీటికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ప్రవేశపెట్టే ఈ–బస్సుల రోడ్‌మ్యాప్‌పై సచివాలయంలో మంగళవారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వచ్చే ఐదేళ్లలో 8,819 డీజిల్ బస్సుల స్థానంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఇంకా 8 ఏళ్లకన్నా ఎక్కువ కాలపరిమితి ఉన్న బస్సులను ఈవీలుగా మార్పిడి చేయాలని నిర్దేశించారు. ప్రయాణికుల అవసరాలు తీర్చేలా, సౌకర్యాలు మెరుగయ్యేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. స్త్రీ శక్తి – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో తలెత్తిన రద్దీకి తగినట్టుగా నూతన బస్సులు ప్రవేశపెట్టాల్సి ఉందన్నారు.

### పర్యావరణహితంగా ప్రజారవాణా

రాష్ట్రంలో పర్యావరణహితమైన ప్రజారవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈవీ బస్సులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2030నాటికి దశలవారీగా డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్, సీఎన్జీ బస్సులను మాత్రమే నిర్వహించాలన్నారు. దీంతో కాలుష్యం తగ్గడమేకాకుండా సంస్థపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. అలాగే ఈ బస్సుల మెయింటెనెన్స్ ప్రయివేట్ ఆపరేటర్లకు అప్పగించాలన్నారు. స్వయంసమృద్ధి సాధించేలా... రైల్వేశాఖ తరహాలో ఏపీఎస్ ఆర్టీసీ కార్గో రవాణాపై మరింత దృష్టి పెట్టాలన్నారు. అన్ని బస్ స్టేషన్లకు వాణిజ్యపరంగా మరింత ఆదాయం వచ్చేలా ఆలోచన చేయాలన్నారు. మరోవైపు పీఎం –ఈ బస్ సేవా పథకం కింద 750 ఈ–బస్సులు రాష్ట్రానికి అందిస్తోందని, అలాగే తిరుమల–తిరుపతికి మరో 300 ఈ–బస్సులు ఇచ్చేందుకు కూడా కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించదని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. థింక్ గ్యాస్ సంస్థ భాగస్వామ్యంతో చిత్తూరు–వెల్లూరు మార్గంలో నడిపే డీజిల్ బస్సులను సీఎన్జీగా మార్చే పైలట్ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ విజయవంతమైందని అధికారులు చెప్పారు.

# సంగీత సాహిత్య సంస్కృతులే భారతీయ సంపదకు మూలాలు

- అన్నమయ్య సంకీర్తనలను ప్రజలకు చేరువ చేస్తున్న శోభారాజు
- అలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది
- 'తందనానా' విజేతలకు పతకాల పంపిణీలో సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): సంగీత సాహిత్యాలు, సంస్కృతి భారతీయ సంపదకు మూలాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కళాకారుల ద్వారా అన్నమయ్య కీర్తలను ప్రజలకు చేరువు చేస్తున్న డాక్టర్ శోభారాజు కార్యక్రమాలకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అన్నమయ్య అంతర్జాతీయ సంకీర్తన పోటీలు "తందనానా – 2025"లో విజేతలైన ముగ్గురు గాయనీ గాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు పతకాలు అందించారు.

మంగళవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాకులో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. సబ్ జూనియర్ విభాగంలో భట్టిప్రోలు మేఘన,జూనియర్ విభాగంలో చిర్పల్లి శ్రీమహాలక్ష్మి, సీనియర్ విభాగంలో సముద్రాల లక్ష్మీ హరిచందన సీఎం చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "సంగీతం, సాహిత్యం, సంస్కృతులే విలువలు నేర్పే సాధనాలు.. భారతీయ మూలాలు. భారతీయ సంగీతంతో భక్తి ఉద్యమానికి ప్రాణం పోసిన మహానుభావుడు తాళ్లపాక అన్నమాచార్యులు. 32 వేల సంకీర్తనలు రచించారు. సామాన్యులకు అర్ధమయ్యే భాషలో అన్నమయ్య కీర్తనలుంటాయి. అన్నమాచార్య కీర్తనలకు ప్రాచుర్యం కల్పించే ఉద్దేశ్యంతో ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్స్ ప్రాంతంలో అన్నమయ్యపురం ఏర్పాటు చేశాం.

అన్నమయ్య సంకీర్తనలను విశ్వవ్యాప్తం చేసేందుకు గత 42 ఏళ్లుగా కృషి చేస్తున్న అన్నమాచార్య భావనా వాహిని సంస్థను అభినందిస్తున్నా. 'తందనాన' పేరుతో అన్నమాచార్య అంతర్జాతీయ సంకీర్తనా పోటీలను శోభారాజు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. భావితరాలకు అన్నమయ్య సంకీర్తనల మాధుర్యాన్ని అందించి... యువ కళాకారులను అత్యున్నతస్థాయిలో ప్రోత్సహిస్తున్నారు. 12 దేశాల్లో 700పైగా కచేరీలు నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలను సామాన్య ప్రజానీకానికి అర్ధమయ్యే భాషలో చెప్పారు. శోభారాజు అన్నమయ్య కీర్తనలకు ఒక బ్రాండ్‌గా నిలుస్తున్నారు. త్వరలోనే హైదరాబాద్‌లోని అన్నమయ్యపురాన్ని సందర్శిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.















చైతన్యరథం

# నాలుగు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లతో పీపీఏలు

- చెత్త నుంచి విద్యుదుత్పత్తికి చర్యలు
- ఘన వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రముఖ మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను ఇంధనంగా మారుస్తూ శుభ్రమైన ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసింది. కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు మున్సిపాల్ ప్రాంతాల్లో స్థాపించబడనున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో మంగళవారం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు (పీపీఏ) జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపా రు. వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించి వాటిని ఇంధనంగా మార్చే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తద్వారా పర్యా వరణ పరిరక్షణతో పాటు పట్టణాల శుభ్రత, పునరుత్పత్తి శక్తి వనరుల అభివృద్ధి సాధనకు వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని అన్నారు. ఈ ఒప్పందాల ప్రకారం నెల్లూరు, కడప, కర్నూలు ప్లాంట్లకు ఏపీఎస్‌పీడీసీఎల్‌తో, కాకినాడ ప్లాంట్ ఏపీఈపీడీసీఎల్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదిరాయ న్నారు. డిస్కంల తరపున ఆంధ్రప్రదేశ్ పవర్ పర్చేజ్ కోఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ), ప్రభుత్వం తరపున స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈ సమన్వయం చేపట్టాయన్నారు. ఈ ప్లాంట్లు జిందాల్, ఆంటోని లారా కంపెనీల ఆధ్వర్యంలో నిర్మాణం, నిర్వహణ జరుగనున్నా యని వివరించారు. కాకినాడ (రామేశ్వరం)లోని 21 మున్సిపాలి టీలు కవర్ అయ్యే విధంగా 957 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అయ్యే ప్రాజెక్టును, నెల్లూరు (దొంతాలి)లో 9 మున్సిపాలిటీలు కవర్ అయ్యే విధంగా 604 టన్నులు వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 12 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అయ్యే ప్రాజెక్టును జిందాల్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కడప (కొలుములపల్లి)లో 18 మున్సిపాలిటీలు కవర్ అయ్యే విధంగా 781 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే ప్రాజెక్టును, కర్నూలు (గార్వేయపురం)లో 13 మున్సిపాలిటీలు కవర్ అయ్యే విధంగా 751 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే ప్రాజెక్టను ఆంటోని లారా కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నాలుగు ప్లాంట్లు ప్రతి రోజూ సుమారు 3,093 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేయనున్నాయన్నారు. టెండర్ల దశలో విజయవాడ, తిరుపతి ప్లాంట్లు 1600 టన్నుల చెత్తను ప్రాసెస్ చేయనున్నాయన్నారు. ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నంలలో ఆపరేషన్‌లో ఉన్న ప్లాంట్ల ద్వారా 2800 టన్నుల చెత్తను ప్రాసెస్ చేయడం జరుగుతుందని, తద్వారా 35 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. మొత్తం ఈ ఎనిమిది ప్లాంట్లు కలిపి 7,493 టన్నుల చెత్తను శక్తిగా మారుస్తూ 119 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమా ర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో పేరు కుపోయిన 85 లక్షల టన్నుల చెత్త ఈ ఏడాది అక్టోబరు 2 కల్లా పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ సేకరించబడే చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసి ఇంధనంగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఈ నేపథ్యంలో ఈ ఒప్పందాలు కురుర్చుకోవడం జరిగిందని తెలిపా రు. ఈ సమావేశంలో నెడ్‌క్యాప్ ఎండీ ఎం.కమలాకర్‌బాబు, ఏపీపీసీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డి.రాజేంద్రప్రసాద్, ఏపీఎస్‌పీ డీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉమాపతి, ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.మహేంద్రనాథ్, పీపీసీసీ జనరల్ మేనేజర్ పి.ప్రభాకర్, జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్స్ అధ్యక్షుడు ఎం.వి. చారి, ఆంటోని లారా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎన్.నారాయణ రావు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల శిల్పి పీవీ నరసింహారావు

**ఆయన ఆశయాలు దేశాభివృద్ధికి మార్గదర్శకాలు: బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్**



విజయవాడ(చైతన్యరథం): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కలపటపు బుచ్చిరాంప్రసాద్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని ఆర్థిక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో బలమైన దేశంగా నిలబెట్టిన దూరదృష్టి గల నాయకుడు పీవీ అని కొనియాడారు. పాండిత్యం, పరిపాలనా నైపుణ్యం, వినయం ఈ మూడు లక్షణాలు పీవీ నరసింహారావు వ్యక్తిత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. భాషలు, సంస్కృతి, సంప్రదాయాలపై ఆయనకు ఉన్న అపారమైన అవగాహన తరతరాలకు ఆదర్శమని తెలిపారు. పీవీ ఆశయాలు ఈనాటికీ దేశాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఆ మహానేతను స్మరించుకోవడమే కాక ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే మనమందరం చేయాల్సిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యులూ శస్త్రచికిత్సలు చేయొచ్చు

- 58 రకాల చికిత్సలు చేయడానికి అవకాశం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం



అమరావతి (చైతన్యరథం): పురాతన భారతీయ వైద్య విధానాన్ని ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానం చేసే దిశగా రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. తగు శిక్షణతో శస్త్ర చికిత్స ప్రక్రియకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న ఆయుర్వేద వైద్యులు స్వతంత్రంగా ఆపరేషన్లు చేయడానికి వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ నియమావళి, 2020 నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేలా తగు గుర్తింపుతో పాటు అనుమతినివ్వడానికి మంత్రి అంగీకరించారు. ఈ నిర్ణయంతో ఇప్పటికే శస్త్ర చికిత్సా విధానంలో పీజీ పట్టా పొందిన వైద్యులు శస్త్ర చికిత్సలు చేయడానికి అవకాశం లభిస్తుంది. ఈ తాజా ప్రభుత్వ నిర్ణయం మేరకు 39 శల్య తంత్ర (జనరల్ సర్జరీ) చికిత్సలు, 19 శలక్యతంత్ర(ఈఎన్‌టీ, ఆప్తమాలజీ) చికిత్సలను ఆయుర్వేద వైద్యులు చేయవచ్చు. వీటిలో అంటు వ్యాధులకు సంబంధించిన శస్త్ర చికిత్సలు, ప్రమాదాల కారణంగా దెబ్బతిన్న జీవకణాల తొలగింపు, గాయాలకు చికిత్స, కుట్లు వేయడం, మొలలు, మలద్వారంలో చీలికలకు చికిత్స, కణుతులు, శుక్లాలు, గవదల తొలగింపు, కండరాల చికిత్స, చర్మ మార్పిడి చికిత్స(స్కిన్ గ్రాఫ్టింగ్) వంటివి ఉన్నాయి. ఈ అంశంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఆయుష్ విభాగం డైరెక్టర్ కె.దినేష్‌కుమార్, ఇతర అధికారులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో విజయవాడ డాక్టర్ ఎన్ఆర్‌యస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలతో పాటు మరో రెండు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని, ఆయా కళాశాలల్లో పీజీ స్థాయిలో అందించబడుతున్న కోర్సుల గురించి అధికారులు మంత్రికి వివరించారు. విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో తక్షణమే శల్యతంత్ర, శకల్య తంత్ర పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని, నాణ్యమైన విద్యను అందించడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ కోర్సులకు అవసరమైన ఆపరేషన్ థియేటర్లు, శస్త్ర చికిత్స పరికరాలను తగు స్థాయిలో అమర్చాలని సూచించారు. 2,500 సంవత్సరాల చరిత్ర కలిగిన శల్య, శకల్య ఆయుర్వేద చికిత్స పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఆ విద్యనభ్యసించిన వారు శస్త్ర చికిత్సలు చేపట్టే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. భారతీయ వైద్య విధాన ప్రక్రియలను ఆధునిక ప్రక్రియలతో అనుసంధానం చేయడానికి ఈ నిర్ణయం చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను కేంద్ర ప్రభుత్వం 2000 సంవత్సరంలోనే విడుదల చేసినా గత ప్రభుత్వం అనంతర చర్యలు చేపట్టలేదని, ఆయుష్ సేవలపై వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు.

# వైసీపీ సర్పంచ్ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

**భూమి, స్థలం కబ్జా..తప్పుడు కేసులతో బెదిరింపులు - ప్రజావేదిక కార్యక్రమంలో బాధితుల గోడు - అర్జీలు స్వీకరించిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



మంగళగిరి(చైతన్యరథం): పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల కార్యక్రమంలో తన సమస్యపై గోడు వెళ్లబోసుకున్నాడు. తమ పూర్వీకుల నుంచి వారస త్వంగా వచ్చిన 0.76 సెంట్ల భూమి సర్వే నంబర్ 14 బసికోవరం పరిధిలో ఉంది. గతంలో తమ కుటుంబం అదే భూమిలోని పాత ఇంట్లో నివాసం ఉండేది. 1983 సంవత్సరంలో అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా గొడవలు తలెత్తడంతో, ప్రాణభద్రత కోసం తమ కుటుంబం కొత్తపాలెం నుంచి సమీప గ్రామమైన మాసాహెబ్ పాలెంకు వెళ్లి అక్కడ స్థలం కార్డు పొంది నివాసం కొనసాగిస్తున్నాం. అయితే వంపుగుడి రాజేష్ వైసీపీ సర్పంచ్ తమ అనుమతి లేకుండా తప్పుడు దస్తావేజుల ఆధారంగా భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు అర్జీలు స్వీకరించారు.

### తప్పుడు కేసులు మోపి వేధిస్తున్నారు

చిత్తూరు జిల్లా వెంకటగిరికోట మండలం గందాకమాకు లపల్లి గ్రామానికి చెందిన రూప గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ భర్త మృతి చెంది 10 సంవత్సరాలు గడిచింది. తనకు, తన పిల్లలకు చెందాల్సిన 1.75 ఎకరాల భూమి, 293 ప్లాట్ స్థలం, డోర్ నెంబరు:35/63 గల ఇంటిని తన అత్త లక్షుమమ్మ, చంద్రశేఖర్, రాజశేఖర్, రమేష్, శ్రీనివాసులు, చిన్న అత్త వెంకటమ్మ, ఆమె కూతురు నాగవేణి తదితరులు అక్రమం గా దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. తనను, తన కుమార్తె హిందును, కుమారుడు చందును తరచూ దుర్భాషలాడుతూ కర్రలతో కొట్టడం, బెదిరించడం చేస్తున్నారు. భయంతో పోలీసు లకు ఫిర్యాదు చేసే పరిస్థితి కూడా లేదు. ప్రస్తుతం తల్లిదండ్రుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నాం. తమపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. కోర్టు చుట్టూ తిరగలేని పరిస్థితిలో బంధువుల ద్వారా కూడా ప్రాణహానీ బెదిరింపులు వస్తున్నాయి. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### భూమి కబ్జాకు యత్నం

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కె.యం.పాలెం గ్రామానికి చెందిన అర్జునరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తన తండ్రి పేరుపై ప్రభుత్వం ద్వారా 0.72 సెంట్ల భూమి సీలింగ్‌లో మంజూరు చేయబడింది. నాటి నుంచే సదరు భూమిలో నీటి సదుపాయాలతో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. అయితే ఇటీవలి కాలంలో ముషిడిపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కొంతమంది బీసీ వర్గస్తులు తమ భూమిని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ అక్రమ చర్యలకు దేవరాపల్లి మండల తహశీల్దార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ అండగా నిలిచి, తనపై తప్పుడు నివేదికలు, కేసులు నమోదు చేయించి తీవ్ర అన్యాయం చేస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

అనకాపల్లి జిల్లా కువంగి గ్రామానికి చెందిన ఉదయలక్ష్మీ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో పెళ్లి సమయంలో తమ కుటుంబానికి చెందిన సర్వే నెంబర్లు 288-14, 288-16లోని కొంత భూమిని విక్రయించి పెళ్లి ఖర్చులు నిర్వహించి, మిగిలిన భూమిని తనకు పసుపుకంకుల రూపంలో ఇచ్చారు. అయితే ములపాటు ప్రాంతంలో ఉన్న తన భూమిని అక్రమంగా కబ్జా చేసి సర్వే నెం.289లోని భూమిని తప్పుడు పత్రాల ఆధారంగా 22-ఏలో నమోదు చేయించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగింది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# గుంతలు లేని రోడ్లే ప్రభుత్వ లక్ష్యం

- జనవరిలోగా మరమ్మతులు పూర్తి చేస్తాం
- పీపీపీ, హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతుల్లో అభివృద్ధి
- టోల్ విధానంపై దుష్ప్రచారాల్లో వాస్తవం లేదు
- ఆర్అండ్‌బీ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 10,294 కి.మీ రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి రూ.3 వేల కోట్లు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఏపీ సచివాల యంలోని ప్రచార విభాగంలో మంగళవారం మీడియా సమావేశం లో మంత్రి మాట్లాడుతూ స్టేట్ హైవేలు, జిల్లాల, మండలాల రహదారుల మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల వచ్చిన తుఫాన్‌ల దెబ్బకు మరికొన్ని రహదారులు మరమ్మ తులకు గురయ్యాయని, వాటిని త్వరలోనే పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రాష్ట్రంగా తయారు చేయడానికి మిషన్ పాట్ హోల్‌లో భాగంగా 2024-25 సంవత్సరానికి 20,060 కి.మీ రోడ్ల పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. మరమ్మతుల నిమిత్తం రూ.861 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇక 2025-26లో, భారీ వర్షాలు, అధిక వర్షాలు, 'మొంథా', 'దిట్వా' తుఫానుల కారణంగా రోడ్లు మరింత దెబ్బతిన్నాయన్నారు. ఈ రోడ్ల మరమ్మతులకు ఈ సంవత్సరం ఇప్పటివరకు 6035 కి.మీ మేర పునరుద్ధరించడానికి ప్రభుత్వం రూ.2500 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. 4259 కి.మీ మేర ఎండీఆర్, రాష్ట్ర రహదారుల మరమ్మతులకు ఆర్థిక శాఖకు మరో రూ.500 కోట్ల ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఇందులో భాగంగా నాబార్డ్ సహాయం కింద 191 ఎండీఆర్ రోడ్లను (1250 కి.మీ పనులు) మెరుగుపరచడానికి రూ.400 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు ఇప్పటికే 52 పనులు పూర్తి చేయగా 132 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తా మన్నారు. ఇక రాష్ట్ర రహదారుల ప్రణాళిక కింద 856 కి.మీ. మేర అభివృద్ధి చేయడానికి రూ.400 కోట్ల అంచనా వ్యయంతో 139 పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించగా ఇప్ప టివరకు 6 పనులు పూర్తయ్యాయని, 113 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఎండీఆర్ ప్లాన్ కింద, 536 కి.మీ. మేర మెరుగుపరచడానికి 86 పనులకు సుమారు రూ.200 కోట్ల అం చనా వ్యయంతో మంజూరు చేయగా, వీటిలో 2 పనులు పూర్తయ్యాయని, 78 పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ పనుల న్నీ మార్చి 2026 నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. అంతేకా కుండా అదనపు ప్రణాళిక కింద 166 ఎండీఆర్ పనులకు రూ.600 కోట్లు, 108 ఎస్‌హెచ్(రాష్ట్ర రహదారి)



పనులకు రూ. 400 కోట్లు మంజూరు చేశామన్నారు. వీటిలో 161 పనులు కాంట్రాక్టర్లకు అప్పగించగా మిగిలిన పనులు టెండర్లు ఈ నెలాఖరు లోపు పిలుస్తామన్నారు. ఈ పనులన్నీ 2026 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. అలాగే సీఆర్ఎఫ్, ఎన్‌డీబీ, ఎస్‌డీఎంఎఫ్, ప్లాన్ వర్క్స్ చేయబడిన, దెబ్బతిన్న పనులను మెరుగుపరచడానికి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. వీటిలో 607 కి.మీ మేర మెరుగుపరచడానికి 106 రద్దు చేయబడిన పనులకు రూ. 276.58 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పనులు జూన్ 2026 నాటికి పూర్తిచేస్తామ న్నారు. అలాగే 647 కి.మీ రోడ్లను మెరుగుపరచడానికి రూ. 205.12 కోట్లతో 126 పనులు గుర్తించామని, ఈ పనులకు త్వరలోనే పరిపాలనా అనుమతి ఇస్తామన్నారు. అంతేకాకుండా 4259 కి.మీ మేర మెరుగుపరచడానికి 866 పనులకు రూ. 500 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించామన్నారు. అనుమతులు రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎన్‌డీబీ కింద గ్రామాలను మండల కేంద్రా లు, జిల్లా కేంద్రాలతో అనుసంధానించడానికి 85 రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయని, 682 కి.మీ. రహదారులను సింగిల్ లేన్ నుంచి 2 లేన్‌కు విస్తరిస్తున్నామన్నారు. వీటిలో ఇప్పటివరకు 236 కి.మీ పూర్తయ్యాయని తెలిపారు. సీఆర్ఎఫ్ రోడ్ల స్కీమ్ కింద 53 పనులు, 703 కిమీ మేర సుమారు రూ.882 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు.

**రహదారుల అభివృద్ధికి పీపీపీ/ బీవోటీ పద్ధతి**

మన రాష్ట్రంలో 12,653కి.మీ రాష్ట్ర రహదారులు ఉన్నా యని, సగటున ప్రతి సంవత్సరం 5%వృద్ధి రేటుతో వాహనాల సంఖ్య పెరుగుతున్నాయని, రద్దీని అనుసరించి రహదారుల విస్తరణ, అభివృద్ధి, నిర్వహణ చేయాల్సిన అవసరముందని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉన్న 20 రాష్ట్ర రహదారులను గుర్తించి వాటిని 4 లేన్లుగా/ రెండు లేన్ల హార్డ్ షోల్డర్స్‌గా వెడల్పు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. పీపీపీ పద్ధతిలో రహదారుల విస్తరణ చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం పరిశీలిస్తుంద న్నారు. కేంద్రం సైతం ఇదే పద్ధతిలో రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేయదుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన 20 రహదారులలో సర్వే నిర్వహించి 40% వరకు 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్'కు అర్హత కలిగిన 709 కి.మీ. పొడవైన 12 రహదారులను గుర్తించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 40% వరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఉన్న రహదారుల విస్తరణకు 20% శాతం నిధులను కేటాయిస్తుందని తెలిపారు. ఇందుకు భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్‌కు అవసరమైన నిధులను, మిగిలిన 20% వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ 12 రహదారుల విస్తరణకు అంచనా విలువ రూ.5,894 కోట్ల రూపాయలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం రూ. 3,292 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు.

**టోల్ విధానం అపోహలు..వాస్తవాలు**

రహదారి టోల్ విధించడం అంటే సామాన్య ప్రజలను దోచుకోవడం అనే దుష్ప్రచారం జరుగుతుందని ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, త్రిచక్ర వాహనదారులు (ఆటోలు), వ్యవసాయం కోసం ఉపయో గించే ట్రాక్టర్లకు ఎటువంటి టోల్ ఉండదు. సామాన్య ప్రజలకు టోల్ వర్తించదు. కేవలం నాలుగు చక్రాల వాహనాలు (కార్లు, జీపులు), సరకుల రవాణాకు ఉపయోగించే లారీలకు మాత్రమే టోల్ వర్తిస్తుందని వివరించారు. యాన్యుటీ పద్ధతిలో రహదారి అభివృద్ధి పనులు మొట్ట మొదటగా రాష్ట్రంలో 2008-09వ సంవత్సరంలో చేపట్టి కడప జిల్లాలో 203 కి.మీ రహదారులను 9 ప్యాకేజీలుగా విభజించి చేపట్టడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో ఆ విధానంలో 8 ప్యాకేజీ పనులకు 535.30 కోట్లతో అభివృద్ధి చేయడానికి పరి పాలన అనుమతులను ఇచ్చి, టెండర్లు కూడా పిలవడం జరి గిందని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్రం జాతీయ రహదారులను 'హైబ్రిడ్-యాన్యుటీ' పద్ధతిలో చేపడుతుందన్నా రు. రాష్ట్ర రహదారుల విస్తరణకు ఉత్తమ పద్ధతి అనుసరిం చాలని ఆలోచన చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ ప్రజలకు భారం లేకుండా ఉండే విధంగా టోల్ ఫీజులు ఉంటాయని తెలిపారు. గుంటూరు- తుళ్లూరు రహదారి నిర్మాణానికి రూ.8.5 కోట్లు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. రూ.3 వేల కోట్లతో చేస్తున్న రహదారుల పనులకు ఇప్పటికే 85 శాతం టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ఈ పనుల పర్య వేక్షణకు రెండు జిల్లాలకు ఒక చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు.

## దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం

- త్వరలో ఉచితంగా త్రిచక్ర మోటార్ వాహనాలు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి
- 7 వరాలు ప్రకటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి డీఎస్‌బీవీ స్వామికి దివ్యాంగుల కృతజ్ఞతలు



అమరావతి (చైతన్యరథం): దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు వెలగపూడి సచివాలయంలో మంత్రి డీఎస్‌బీవీ స్వామిని దివ్యాంగులు కలిసి....ఇటీవల దివ్యాంగులకు 7 వరాలు (ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమరావతిలో దివ్యాంగ్ భవన్, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, క్రీడలకు ప్రోత్సాహం, ప్రత్యేక ఆర్థిక సబ్సిడీలు, బహుళ అంతస్తుల ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టులలో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, వైద్య, సామాజిక భద్రత) ప్రకటించినందుకు గౌరవ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి డీఎస్‌బీవీ స్వామి మాట్లాడుతూ...దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తున్నాం. దివ్యాంగులకు ఉచితంగా త్వరలో త్రీ వీలర్స్ (రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు) అందిస్తాం. రూ.17.50 కోట్ల వ్యయంతో నియోజకవర్గానికి 10 మంది చొప్పున 1,750 మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు అందిస్తాం. దివ్యాంగుల కోసం విశాఖలో రూ. 200 కోట్లతో పారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నాం. దివ్యాంగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు నాయుడు అన్ని విధాల అండగా ఉన్నారని మంత్రి డీఎస్‌బీవీ స్వామి తెలిపారు.

## ఆందోళనకర స్థాయిలో రోడ్డు ప్రమాదాలు

- కఠినంగా ట్రాఫిక్ నిబంధనల అమలు
- హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరణ
- రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా రాష్ట్రస్థాయి రోడ్డు భద్రతా కార్యక్రమం
- పాల్గొన్న మంత్రులు ఆనం, అనగాని, ఉన్నతాధికారులు




రేణిగుంట (చైతన్యరథం): ప్రజల ప్రాణాల రక్షణకే ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తుందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా రేణిగుంట విమానాశ్రయంలో 'రోడ్డు భద్రత మా ప్రాధాన్యత' పేరిట రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం వంటి కారణాల వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తప్పనిసరని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి సడలింపులు ఉండవని, ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీ ప్రశ్నే లేదన్నారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ చట్టాల భయం కంటే ప్రజల్లో అవగాహన పెంపొందించటమే ప్రమాదాల నియంత్రణలో కీలకమన్నారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని, ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు.

అనంతరం ట్రాఫిక్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పోలీసు శాఖకు అధునాతన బ్రీత్ అనలైజర్ పరికరాలను మంత్రులు అందజేశారు. ఈ పరికరాల ద్వారా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని వేగంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా పరిపాలన అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల

**- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు**



న్యూఢిల్లీ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్ గా ఆయనను మోదీ సర్కార్ నియమించింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ పదవికి దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన న్యాయపదవుల్లో ఒక్కటిగా గుర్తింపు ఉంది.

కనకమేడల రవీంద్ర కుమార్ నియామకం న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవానికి, సామర్థ్యానికి గుర్తింపుగా రాజకీయ, న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ జీవితంతో పాటు న్యాయరంగంలోనూ చురుకైన పాత్ర పోషించిన ఆయనకు ఇప్పుడు దేశస్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకంగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై కనకమేడల రవీంద్ర కుమార్ కీలక పాత్ర పోషించనున్నారు. రాజ్యాంగపరమైన కీలక వివాదాల్లో ప్రభుత్వ వాదనను ఆయన బలంగా వినిపిస్తారని కేంద్రం భావిస్తోంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు ఈ పదవి వరించడంతో తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**- విద్యార్థుల భవిష్యత్తుకు లోకేష్ బాటలు**

**- బాపట్లలో ఉన్నత పాఠశాల భవనం ప్రారంభించిన మంత్రి కొలుసు**



బాపట్ల (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్లలో సీఎం, పీఎం నిధులతో నిర్మించిన పురపాలక ఉన్నత పాఠశాల భవనాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. 2024 డిసెంబరు 7న ఇదే పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొన్నారు. సమస్యలను గమనించి నిధులు మంజూరు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోనే భవన నిర్మాణం పూర్తి చేసి నేడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోనే ఈ పాఠశాలకు అత్యంత ప్రాచీన చరిత్ర ఉందని, ఇందులో చదివిన ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మంత్రి లోకేష్ పాఠశాలలను తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్తు కోసం పాటుపడుతున్నారని ప్రశంసించారు. అనంతరం ఎమ్మెల్యే అందజేసిన 5వేల నోట్‌పుస్తకాలను మంత్రి, ఎంపీ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, శివనారాయణ,ఆర్డీవో గ్లోరియా,డీఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు షేక్ సలీమా పాల్గొన్నారు.

## పాస్టర్ల గౌరవ వేతనాలకు రూ.50.04 కోట్లు విడుదల

**- సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే ఉత్తర్వులు**

**- 8427 మంది పాస్టర్లకు లబ్ది**

**- సీఎం చంద్రబాబుకు మైనారిటీ మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు**



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే పాస్టర్ల గౌరవ వేతనాలు చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50.04 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని ఏ-ప్లస్ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల సందర్భంగా క్రిస్మస్ పండుగకు ముందుగానే 24 తేదీలోపు పాస్టర్లకు గౌరవ వేతనం అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే.

కాగా 2024 డిసెంబరు నుండి 2025 నవంబరు నెల వరకు, ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున 8427 మంది పాస్టర్లకు 12 నెలల గౌరవ వేతనం చెల్లించేందుకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఒకేసారి ఒక్కొక్క పాస్టర్‌కు రూ.60 వేలు చొప్పున క్రిస్మస్ పర్వదినానికి ముందే వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, 24 గంటల్లోపే పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపు కోసం జీవో విడుదల చేయడంతో సీఎం చంద్రబాబు మైనారిటీల పక్షపాతి అనే విషయం మరో మారు స్పష్టమైందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి వరకు మైనారిటీల సంక్షేమానికి చంద్రబాబు చేస్తున్న కృషిని మైనారిటీలు మరువలేరన్నారు. ఇచ్చిన హామీని కేవలం 24 గంటలలోపే నెరవేర్చడం పట్ల సీఎం చంద్రబాబుకు మైనారిటీశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

- **అటవీ మార్గాల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు**
- **వేర్వేరు ఘటనల్లో ఒకేరోజు ఆడ పులి, చిరుత మృతి చెందడం దురదృష్టకరం**
- **రెండు ఘటనలపై తక్షణం విచారణ జరిపి నివేదిక ఇవ్వండి**
- **అటవీశాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం**



అమరావతి (చైతన్యరథం): పర్యావరణ సమతుల్యత పరిరక్షణలో వన్య ప్రాణుల సంరక్షణ ప్రధాన అంశం.. వన్యప్రాణుల రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలి.. ముఖ్యంగా అటవీ మార్గాల వెంట ప్రయాణించే వాహనదారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. మంగళవారం ప్రకాశం జిల్లా, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో వాహనం ఢీకొని ఆడ పులి, ఆదోని రేంజ్‌లో రైలు ఢీకొని చిరుత మృతి చెందిన ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. రెండు ప్రమాదాలపై తక్షణం విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అటవీ సరిహద్దు మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంగళవారం వేర్వేరు ఘటనల్లో ఆడ పులి, చిరుత మృతిపై అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఒకే రోజు రెండు ప్రమాదాల్లో పులి, చిరుత ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించిందన్నారు. అడవులు, వన్యప్రాణి సంచార మార్గాలకు సమీపంగా ఉన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల వద్ద ప్రమాదాల నివారణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైవే అథారిటీ, రైల్వే, పోలీస్ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

**హాట్ స్పాట్స్ గుర్తించండి**

వన్యప్రాణులు తరచుగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రంబుల్ స్ట్రిప్స్, బ్యారికేడ్లు, సోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలి. అటవీ మార్గాల సమీపంగా వెళ్లే రహదారుల వెంబడి రాత్రి సమయాల్లో వాహనాల వేగంపై పరిమితులు విధించి నిబంధనలు కఠినంగా అమలు చేయాలి.

స్పీడ్ గన్స్, ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు వినియోగించి పరిమితికి మించి వేగంతో వెళ్లే వాహనాలపై జరిమానాలు విధించాలి. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలి. వన్యప్రాణుల సంచారం, రక్షణపై వాహనదారులు, స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాలని పవన్ చెప్పారు.

# వైకుంఠ ద్వార దర్శనాలపై అసత్య ప్రచారాలు నమ్మవద్దు

- **తొలి మూడు రోజులు టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం**
- **ఆ రోజుల్లో టోకెన్ లేని భక్తులకు దర్శనం ఉండదు**
- **భక్తులు యథావిధిగా తిరుమలకు రావొచ్చు**
- **వారికి రావద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదు**
- **అయితే దర్శనాలు లేక ఇబ్బంది పడే అవకాశం ఉంది**
- **జనవరి 2 నుంచి 8 వరకు టోకెన్ లేని భక్తులకూ వైకుంఠద్వార దర్శనం**
- **టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టీకరణ**



తిరుమల (చైతన్యరథం): ఈ నెల 30 నుండి జనవరి 8వ తేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ లేని భక్తులకు తిరుమలకు అనుమతి లేదంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. భక్తులను తిరుమలకు రావద్దని చెప్పే అధికారం ఎవ్వరికీ లేదని ఆయన స్పష్టం చేశారు.

గత రెండు నెలలుగా వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్ల కోసం టీటీడీ అధికారులు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మంత్రులతో సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసి వైకుంఠద్వార దర్శనాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందని తెలిపారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీలకు ఈ-డిప్ ద్వారా భక్తులకు దర్శన టోకెన్లు కేటాయించామని చెప్పారు. ఈ మూడు రోజుల్లో టోకెన్ ఉన్న భక్తులను మాత్రమే దర్శనాలకు అనుమతిస్తామని, టోకెన్ లేని భక్తులు తిరుమలకు యథావిధిగా రావచ్చని స్పష్టం చేశారు. కాకపోతే టోకెన్ లేని భక్తులకు దర్శనాలు లేకపోవటంతో ఇబ్బంది పడే అవకాశం ఉంటుందని చెప్పారు.

టోకెన్ పొందలేని భక్తులు జనవరి 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠద్వార దర్శనాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ బస్సుల్లో బ్యానర్లు, తిరుపతిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్రాడ్ కాస్టింగ్, టీటీడీ సోషల్ మీడియా, ఎస్వీబీసీ, ఇతర మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. టీటీడీ సూచనలు పాటిస్తూ భక్తులందరూ సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

# అన్ని వర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమే**

**- క్రీడలతోనే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు**

**- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



అద్దంకి (చైతన్యరథం): అన్ని వర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో మంగళవారం మంత్రి గొట్టిపాటి విస్తృతంగా పర్యటించారు. సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద 47 మంది లబ్దిదారులకు రూ.44 లక్షల విలువైన చెక్కులను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. ఆర్థిక సహాయం అందడంతో లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జె. పంగులూరు మండలం కొండమంజులూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని 9 జిల్లాలకు చెందిన జట్లు పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అత్యంత అవసరమన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పాఠశాలల్లో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందని, దీని ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపడి విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు చేపడుతున్నామని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు దేశంలో ఆంధ్రప్రదేశ్ దిక్సూచి కావాలని మంత్రి ఆకాంక్షించారు. మన దేశ యువతకు ఉద్యోగావకాశాలు మన దేశంలోనే కల్పించాల్సిన అవసరం ఉందని, ఆ మార్పు ఆంధ్రప్రదేశ్ నుంచే మొదలవుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. తదుపరి మేదరమెట్లలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. పతుల్, ఎన్టీఆర్ కాలనీలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి.. రూ.3.70 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన చర్చిని ప్రారంభించారు. క్రిస్టియన్ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు

## మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల అభివృద్ధి

# పీపీపీ విధానంతోనే సాధ్యం

- **విజయవాడ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల కోసం కృషి**
- **ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టీకరణ**
- **సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల బాలికల హాస్టల్ భవనం ప్రారంభోత్సవం**
- **మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించిన ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇండియాలోనే బెస్ట్ పాలసీ పీపీపీ విధానం రాష్ట్రానికి తీసుకువచ్చారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ, ఆరోగ్యంపై పార్లమెంట్ స్థాయీ సంఘం సూచించిన పీపీపీ విధానంతోనే మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల అభివృద్ధి సాధ్యమన్నారు.

విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థినులు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్ల కోసం నిర్మించిన హాస్టల్ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి కె.సత్య కుమార్ యాదవ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ లక్ష్మీశా ఈ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం హాస్టల్ మొత్తం తిరిగి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ హాస్టల్ భవన నిర్మాణానికి 2017 లో రూ.21 కోట్ల నిధులతో శంకుస్థాపన జరిగి పనులు ప్రారంభం కాగా, 2019 తర్వాత గత వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి నిధులతో పాటు, పనులు కూడా నిలిపివేసిందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మిగిలిన నిధులు విడుదల చేయటంతో నిర్మాణ పనులు పూర్తై చక్కటి మౌలిక సదుపాయాలతో హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

ఈ హాస్టల్ భవనం నిర్మించుకోవటానికి పదేళ్ల సమయం పట్టిందని, అభివృద్ధి విషయంలో ఇలాంటి జాప్యం వుండకూడదనే ఉద్దేశ్యంతోనే పీపీపీ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ రూపకల్పన చేశారన్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు చక్కటి హాస్పటల్ ఇవ్వటంతో పాటు నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు పీపీపీ మోడల్ విధానం తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ విధానంలో గవర్నమెంట్ కు 50 శాతం కోటా వుంటుందని, రిజర్వేషన్‌లో ఎలాంటి మార్పులేదని, అన్నింటికంటే ముఖ్యంగా 70 శాతం ఆయుష్మాన్ భారత్ పేషంట్స్ బెడ్స్ కేటాయిస్తారన్నారు. అంతే కాదు ఈ విధానంలో రెండు సంవత్సరాల కాలంలో చక్కటి సదుపాయాలతో మెడికల్ కాలేజ్‌లను నిర్మించాల్సి వుంటుందని వివరించారు.

గత ప్రభుత్వం రూ.8500 కోట్లతో నాలుగేళ్లలో 17 కాలేజీలు నిర్మిస్తామని చెప్పి రూ.1000 కోట్లు ఖర్చు చేయగా, చాలా మెడికల్ కాలేజీల్లో రాయి కూడా వేయలేదన్నారు. ఇదే రీతిన వెళితే ఆ 17 కాలేజీలు నిర్మించాలంటే 18 ఏళ్లు పడుతుందంటూ ఏద్దేవా చేశారు. పేద విద్యార్థులు ఎక్కవ మందికి వైద్య విద్య సీట్లు అందుబాటులోకి రావాలన్నా, త్వరగా మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ నిర్మాణం జరగాలన్నా పీపీపీ విధానంలోనే సాధ్యమని వెల్లడించారు.

### సీఎస్ఆర్ నిధులకు కృషి

ఇటీవల విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మిగిలిన భవనాల పూర్తి కావటానికి రూ.80 కోట్లు నిధులు అవసరం అవుతాయని ోస్పటల్ అధికారులు తెలిపారన్నారు. అదే విధంగా ఈ ఆసుపత్రికి అవసరమైన లినాక్ మిషన్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ను రూ.2 కోట్ల 80 లక్షలు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను రూ. 1 కోటి 30 లక్షలు సీఎస్ఆర్ నిధుల కింద కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఈ ప్రభుత్వాసుపత్రిలో రోజుకి ఓపీ కింద 4,200 మంది రోగులు వస్తుంటారని, ఈ హాస్పటల్‌లో అన్ని సుదపాయాలు కల్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించుకున్నట్లు తెలిపారు.

### పూర్తిస్థాయి కాన్సర్ విభాగం: ఎమ్మెల్యే గద్దె

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భారతదేశంలో తొలి మెడికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు దక్కుతుందన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో పూర్తి స్థాయిలో కాన్సర్ విభాగం ఏర్పాటు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### కోటి సంతకాలు బూటకం: మంత్రి సత్యకుమార్

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ కళాశాల వసతిగృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారన్నారు. 80 శాతం పూర్తయిన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమంటూ మండిపడ్డారు. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి రూ. 5 కోట్లు ఇవ్వని జగన్‌కి పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సిద్ధార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వైసీపీ నాయకుల్లాగ సంకుచిత మనస్తత్వంతో పనులు ఆపేయడం లేదంటూ...వైఎస్ తెచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు రద్దు చేశారా..అంటూ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా విద్యార్థుల సంక్షేమం ముఖ్యమన్నారు. మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం తెచ్చింది వైసీపీ ప్రభుత్వం కాదా అంటూ నిలదీశారు. పీపీపీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు కోటి సంతకాలు చేశారని వైసీపీ నేతలు అంటున్నారు.. సుపరిపాలన యాత్రలో 5 లక్షల మంది దాకా ప్రజలను ఇప్పటి వరకూ ప్రశ్నించా.. ఎవ్వరూ సంతకం పెట్టలేదని చెప్పారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. కోటి సంతకాలు పెట్టింది ఆత్మలు, ప్రేతాత్మలు అనుకోవాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతకాలు చేయని మాట వాస్తవమన్నారు. వికసిత భారత్ నిర్మాణం కావాలంటే ఆరోగ్యకరమైన సమాజం అవసరమన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ వెంకటేష్ , సూపరిటెండెంట్ వెంకటేశ్వర రావు తో పాటు వైద్య కళాశాల సిబ్బంది, మెడికల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆప్కోలో భారీ డిస్కౌంట్ అమ్మకాలు

- **రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడి**
- **60, 50, 40 శాతం రాయితీపై చేనేత వస్త్రాల అమ్మకాలు**
- **గుంటూరు, మంగళగిరిలోని యర్రబాలెంలో 60 శాతం డిస్కౌంట్ ప్రత్యేక కౌంటర్లు**
- **50 శాతంపై విజయవాడలోని ఆప్కో మెగా షో రూమ్‌లో అమ్మకాలు**
- **మిగిలిన అన్ని ఆప్కో షో రూమ్ ల్లోనూ 40 శాతంపై అమ్మకాలు**
- **26 నుంచి తిరుపతిలో చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం**




అమరావతి (చైతన్యరథం): రానున్న సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని ఆప్కో షో రూమ్‌ల్లో భారీ డిస్కౌంట్‌తో అమ్మకాలు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత తెలిపారు. 60, 50, 40 శాతాల డిస్కౌంట్‌ల పై చేనేత వస్త్రాలను విక్రయించనున్నామని, ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. తిరుమల వెంకన్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా తిరుపతిలో చేనేత బజార్ నిర్వహించనున్నామన్నారు.

మరో రెండ్రోజుల్లో చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాలను కొనుగోలు చేయనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మెగా క్లస్టర్ల ఏర్పాటు, గడిచిన మూడు నెలల్లో ఆప్కో అమ్మకాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రానున్న సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 60 శాతం డిస్కౌంట్ అమ్మకాలపై గుంటూరులోని చేనేత ఏడీ కార్యాలయ ఆవరణలోనూ, మంగళగిరిలోని యర్రబాలెంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన చర్యలు వెంటనే ప్రారంభించాలన్నారు. విజయవాడలోని ఆప్కో మెగా షో రూమ్ లో 50 శాతం డిస్కౌంట్ అమ్మకాలు చేయనున్నామన్నారు.

ఈ నెల 29వ తేదీ నుంచి ప్రత్యేక డిస్కౌంట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని మిగిలిన అన్ని ఆప్కో షో రూమ్ ల్లో 40 శాతంపై డిస్కౌంట్ అమ్మకాలు సంక్రాంతి వరకూ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రానున్న సంక్రాంతి నేపథ్యంలో ఆప్కో షో రూమ్‌ల్లో డిస్కౌంట్ అమ్మకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. తెలుగువారి పెద్ద పండుగను సంప్రదాయరీతిలో జరుపుకోవాలని, ఇంటిల్లిపాది చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత కోరారు.

### రెండ్రోజుల్లోగా సహకార సంఘాల నుంచి కొనుగోళ్లు

మరో రెండ్రోజుల్లో రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలు ప్రారంభించాలని మంత్రి సవిత ఆదేశించారు. ఆప్కో షో రూమ్‌ల్లో వినియోగదారుల నుంచి డిమాండ్ ఉన్న వస్త్రాలను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. నిర్ణీత గడువును నిర్దేశించుకుని ఈ కొనుగోళ్లు ముగించాలన్నారు. సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలను నేరుగా ఆప్కో షో రూమ్ లకు తరలించాలన్నారు.

### రూ.99.60 కోట్ల ప్రాజెక్టులకు అనుమతులు తీసుకురండి...

ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు రూ.38.31 కోట్లు, పిఠాపురం స్పెషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుకు రూ.15.11 కోట్లు, మంగళగిరి హ్యాండ్లూమ్ పార్క్ కు రూ.22.36 కోట్లు, అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటుకు రూ.15 కోట్లు, 30 ఆప్కో షో రూమ్‌ల అభివృద్ధికి రూ.8.82 కోట్లతో ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి తెలిపారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద కేంద్రానికి పంపించిన రూ.99.60 కోట్ల విలువైన ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు వచ్చేలా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు.

### 26 నుంచి తిరుపతిలో చేనేత ఎగ్జిబిషన్

రానున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా తిరుమలకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో తిరుపతిలో ఈ నెల 26 నుంచి చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. వచ్చే నెల ఏడో తేదీ వరకూ తిరుపతిలోని డీపీఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే చేనేత ఎగ్జిబిషన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణిని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రధాన నగరాల్లో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# పీపీపీపై వైసీపీ అసత్య ప్రచారాలు సిగ్గుచేటు

- మెరిట్ వైద్య సీట్లు లేకుండా చేసింది జగన్‌రెడ్డే
- గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని నాశనం చేశారు
- చంద్రబాబు అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు
- 2029 నాటికి అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇల్లు
- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు
- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నెంబర్ వన్ స్టేట్‌గా నిలబెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతా యుతంగా పనిచేస్తోందని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడుతూ పీపీపీ అనేది కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టింది కాదని, ఇది ప్రపంచ వ్యాప్తంగానే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న విధానమని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో పీపీపీ మోడల్‌ను విమర్శించడం సరికాదు. గత ప్రభుత్వం 17 కాలేజీలు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటుందని, కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేసి రూ.8,500 కోట్ల ప్రాజెక్టును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన పీపీపీ విధానం వల్ల 50% సీట్లు మెరిట్ ప్రాతిపదికన కేవలం రూ.15,500 ఫీజుతో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే దక్కుతాయన్నారు. గత ప్రభుత్వ విధానం వల్ల కేవలం 35% సీట్లు మాత్రమే మన విద్యార్థులకు అందేవని, ఈ మార్పు వల్ల కలిగే ప్రయోజనాన్ని విపక్షం జీర్ణించుకోలేకపోతుందన్నారు. పీపీపీ టెండర్లలో పాల్గొంటే జైలుకు పంపిస్తామని విపక్షం చేస్తున్న బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. మన రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే 32% అదనంగా అప్పులు చేసిందని స్వయంగా కాగ్ నివేదికలో స్పష్టంగా పేర్కొందన్నారు. 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన ప్రాజెక్టులను గత ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపివేసిందన్నారు.

చింతలపూడి ప్రాజెక్టు 7-8 వేల కోట్లతో పూర్తి అయ్యే అవకాశం ఉన్నా అప్పటికే రూ.4 వేల కోట్లు ఖర్చు చేసినా, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారనే కారణంతో నిలిపివేశారన్నారు. దీనివల్ల 2.5 లక్షల ఎకరాల సాగునీరు, లక్షల మందికి తాగునీరు అందకుండా పోయిందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కూడా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం 18 నెలల కాలంలో దాదాపు 50 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, పరిశ్రమలు పెట్టే పెట్టుబడిదారులకు ఇన్సెంటివ్స్ అందించడానికి 'ఎస్క్రో అకౌంట్' విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పొరుగు రాష్ట్రాల మంత్రులు కూడా ఏపీకి వస్తున్న పెట్టుబడుల గురించి చర్చించే స్థాయికి రాష్ట్రం చేరుకుందంటే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, పరిపాలనా దక్షత కారణంగా పేర్కొన్నారు. విపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో విద్వేషాలు, ఉద్వేగాలు రెచ్చగొడుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేవలం ప్రతిపక్ష హోదా రాలేదనే నెపంతో అసెంబ్లీకి రాకుండా ఉండటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని హితవు పలికారు.

**విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే లక్ష్యం**

గత ప్రభుత్వం సోలార్ కంపెనీలతో ఉన్న ఒప్పందాలను రద్దు చేయడం వల్ల రాష్ట్రంపై రూ.9,000 కోట్ల భారం రాష్ట్రంపై పడింది. తక్కువ ధరకు వచ్చే సోలార్ విద్యుత్‌ను కాదని, ఓపెన్ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.14 వరకు విద్యుత్ కొనడం వల్ల ప్రజలపై భారం పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాబోయే ఐదేళ్లలో యూనిట్ విద్యుత్ ధరను రూ.1.20 పైసలు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వం వచ్చే సమయానికి యూనిట్ ధర రూ.5.19 పైసలు ఉండగా.. ప్రస్తుతానికి అది రూ.4.80 - రూ.4.90 మధ్య ఉందని, దీనిని రూ.4 కన్నా తక్కువకు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ప్రతి పేదవాడు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇందులో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని (Per capita income)రూ.50 లక్షల మించి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. జీడీపీ పెరుగుదలను ప్రతి సంవత్సరం మానిటర్ చేస్తూ ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**క్వాంటం కంప్యూటర్..పెట్టుబడుల ఆకర్షణ..లోకేష్ కృషి**

ప్రపంచంలోనే అతికొద్ది దేశాలకే అందుబాటులో ఉన్న క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను రాష్ట్రం ద్వారా దేశానికి అందించబోతున్నామన్నారు. దీనికి కావలసిన కాంపోనెంట్స్ తయారీ కూడా మన రాష్ట్రంలోనే జరుగుతుందని పేర్కొన్నారు. బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై ఒక పారిశ్రామికవేత్త సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు తక్షణమే స్పందించి వారిని రాష్ట్రానికి ఆహ్వానించిన తీరు మంత్రి లోకేష్ పనివేగానికి నిదర్శనమన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పర్యటించి రాష్ట్ర విధానాలు, మానవ వనరులు, సహజ వనరులపై నమ్మకాన్ని కలిగించారు. గూగుల్, రిలయన్స్, కాగ్నిజెంట్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి రావడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.

**అర్హులైన వారందరికీ గృహాలు**

రాష్ట్రంలో గృహ నిర్మాణంపై మాట్లాడుతూ 2014-2019 మధ్య కాలంలో దాదాపు 5 నుంచి 6 లక్షల కుటుంబాలకు మంజూరైన గృహాలను గత ప్రభుత్వం రాజకీయ కారణాలతో రద్దు చేసి పేదలను ఇబ్బందులకు గురిచేసింది. ఇప్పటివరకు 18.5 లక్షల ఇళ్లు మంజూరు కాగా, గత ప్రభుత్వం కేవలం 6.5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో 3.2 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 5.5 లక్షల ఇళ్లను 2026 జూన్-జూలై నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 41,000 ఇళ్లు మంజూరు చేయగా, గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు గృహాలను మంజూరు చేస్తామని తెలిపారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనారిటీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీజీటీడీ ఎస్ వర్గాలకు రూ.లక్ష వరకు అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి 40% నిధులను కేటాయించాలని నిర్ణయించాం. గత ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల లబ్ధిదారులు సిబిల్ స్కోర్ తగ్గి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాది జూన్ నాటికి టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇళ్లస్థలాలు**

గత ప్రభుత్వ కాలంలో (2019-2024) అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య 22,000 నుంచి 12,000కు తగ్గించింది. ప్రస్తుత ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. సోషల్ మీడియా, యూ ట్యూబర్లకు కూడా అక్రిడిటేషన్ ఇచ్చే అంశంపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని వేశాం. రాష్ట్ర, జాతీయ స్థాయి పాలసీలను పరిశీలించి కార్డుల సంఖ్యను పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి క్యాబినెట్ ఆమోదం పొంది ఇప్పటికే జీవో విడుదలయింది. జర్నలిస్టులకు 2014-2019 మధ్య కాలంలో భూ కేటాయింపులకు సంబంధించి కొన్ని జీవోలు ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు.

# జగన్‌రెడ్డి ప్రజలను భయభ్రాంతులు చేస్తున్నాడు

- యువత చేతికి కత్తులు, తల్వార్లు ఇస్తున్నాడు
- హింసను ప్రేరేపిస్తే జైలుకు పోక తప్పదు
- లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో వైసీపీ శ్రేణులకి చాలా క్లియర్‌గా రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని, వైసీపీ అంటే రాష్ట్ర ప్రజలకు భయం అంటే ఏంటో తెలియాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు మండిపడ్డారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఏ నాయకుడైనా ప్రజలను సక్రమైన దారిలో నడిపించాలి. చంద్రబాబు పాలనలో అదే జరుగుతూ వచ్చింది. కానీ రాష్ట్రంలో జగన్ వచ్చిన తర్వాత అరాచకాలే చేశాడు. అధికారం కోల్పోయినా అరాచకాలు సృష్టిస్తున్నాడు. పుట్టినరోజు చేసుకుంటే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడమనో, సేవా కార్యక్రమాలు చేయాలనో పిలుపునివ్వాలి. కానీ జగన్ దారుణమైన పిలుపిచ్చాడు. రాష్ట్రం మొత్తాన్ని కూడా భయభ్రాంతులు గురిచేయాలి..మనం అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన, బీజేపీకి ఓట్లు వేసిన ప్రజలను నరికి పడేస్తాం అన్నట్టుగా ఒక సందేశాన్ని పంపించేలా కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్ల మీదకు తల్వార్లు, కత్తులు తీసుకుని వచ్చి మూగ జంతువులను నరికి ఆ రక్తాన్ని ఒక పిశాచి అయిన జగన్ చిత్రపటానికి రక్తాభిషేకం చేశారు. చేతుల్లోకి రక్తం తీసుకుని జగన్‌కు రక్తార్పణం చేసి నినాదాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. టెర్రరిస్టులు స్లీపర్ సెల్స్‌ని తయారు చేసినట్టు..రాష్ట్రంలో జగన్ యువతను గంజాయికి బానిసలు చేసి సైకోలుగా మార్చాడు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద పిల్లలను ఎంచుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేని వాళ్లని ఎంచుకుని ఆత్మహుతి దళాలుగా తయారు చేస్తున్నారు. అసలు ఎవరు ఈ బ్యానర్లు కట్టమన్నారు.. బ్యానర్లు కడటానికి ఎవరు డబ్బులు ఇచ్చారు.. వీళ్లు గంజాయి సేవించేందుకు ఎవరు డబ్బులు ఇచ్చారు..ఆ మేకలు తేవడానికి ఎవరు డబ్బులు ఇచ్చారు.. ఆ తల్వార్లు ఎవరు కొనిచ్చారు అని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతోనే రాష్ట్రంలో మూగజీవాలను క్రూరంగా నరికి రక్తాభిషేకాలు నిర్వహిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారు. జగన్, అవినాష్ రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలకు పిల్లలు ఉన్నారు. వాళ్ల పిల్లేమో విదేశాల్లో చదివిస్తున్నారు. మా పిల్లలేమో ఇక్కడ కత్తులు, తల్వార్లు పట్టుకుని రప్పా రప్పా నరుకుతామని జగన్ రక్తదాహం కోసం రోడ్ల మీదకు వస్తున్నారు. జగన్ పిల్లలేమో బాగుపడాలి..మా పిల్లలేమో నాశనం కావాలా? అని ప్రశ్నించారు.

**చంద్రబాబును చూసి నేర్చుకోండి**

నాయకుడంటే ఎలా ఉండాలో చంద్రబాబును చూసి నేర్చుకోండి. ఇక్కడ చంద్రబాబు పాలనలో దాదాపు 16 వేల మంది డిఎస్సీ భర్తీ చేస్తుంటే.. అక్కడ జగన్ గొర్రెలను తీసుకొచ్చి పిల్లల చేత నరికిస్తా ఉన్నాడు. ఇక్కడ లోకేష్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చి మా పిల్లలను ఉద్యోగస్తులు చేస్తుంటే..జగన్‌రెడ్డి మా పిల్లల చేత బ్యానర్లు కట్టించి ఎవడు వస్తాడో రండిరా నరికేస్తాం చంపేస్తాం అవసరమైతే మేము చచ్చిపోతాం అనేలా మాట్లాడిస్తున్నారు. జగన్ రక్తార్పణాలపై పవన్‌కళ్యాణ్ స్పందించారు. నేను టీడీపీ కార్యకర్తగా పవన్‌ను అభినందిస్తున్నాను. రాజకీయంగా ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారు. లోకేష్ రెడ్ బుక్‌లో మూడు పేజీలు మాత్రమే తీశామని చెప్పారు. రెడ్ బుక్ అంటే రాజ్యాంగానికి ప్రతిరూపం. రాజ్యాంగపరంగా పరిపాలన చేయమని మీకు అవకాశం ఇచ్చినప్పుడు దాన్ని తప్పుదారి పట్టించి దళితులకు గుండు కొట్టించి హింసించారు. రెడ్‌బుక్‌లో పేర్లు ఉన్నాయి. దళితులను చంపి డోర్ డెలివరీ చేసినవాళ్ల పేర్లు ఉన్నాయి. కల్తీ సారాకి పేదవాళ్లని చంపిన వాళ్ల పేర్లు ఉన్నాయి. ఇసుకు దందా చేసిన వాళ్ల పేర్లు ఉన్నాయి. ఇలా అనేక నేరాలు ఘోరాలు చేసిన వైసీపీ నాయకుల పేర్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం రాష్ట్రంలో ఉన్న యువతను కాపాడుకోవడం కోసం లోకేష్, పవన్‌లు బాధ్యతగా పనిచేస్తున్నారు. రక్తం మరిగిన రాక్షసుడి లాగా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడు. రోడ్లపై హింసను ప్రేరేపిస్తామంటే కచ్చితంగా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

# గడువులోగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు సిద్ధం కావాలి

## వీఎంఆర్డీఏ అధికారులకు గంటా శ్రీనివాసరావు సూచన



సింహాచలం, (చైతన్యరథం): భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధమయ్యే వచ్చే ఏడాది జూన్ నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు అందుబాటులోకి వచ్చేలా పనులు వేగవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ తో కలిసి పాత అడివివరం జంక్షన్ నుంచి గండిగుండం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ రోడ్డులో రెండు చోట్ల విస్తరణ పనులకు అంతరాయం కలుగుతోందని.. వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలియజేశారు. అడివివరం - గండిగుండం రోడ్డుపై ప్రయాణించే వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగానే హైవేకు వెళ్లాల్సి రావడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, దానికి ప్రత్యామ్నాయం చూడాలని గంటా సూచించారు. రూ.175 కోట్ల వ్యయంతో భీమిలి నియోజకవర్గంలోని 26.72 కిలోమీటర్ల పొడవున 7 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. చిప్పాడ - పోలిపల్లి, నేరెళ్లవలస - తాళ్లవలస, బోయపాలెం - కాపులుప్పాడ, గంభీరం - గంభీరం హైవే, గంభీరం - శివశక్తినగర్, గంభీరం - పరదేశిపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లు కూడా గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

**రామవరం లే అవుట్ సందర్శన**

వీఎంఆర్డీఏ అభివృద్ధి చేస్తున్న రామవరం లే అవుట్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ మంగళవారం సందర్శించారు. ల్యాండ్ పూలింగ్ కింద తీసుకున్న భూముల్లో లే అవుట్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంఐజీ హౌసింగ్ కోసం వీఎంఆర్డీఏ సేకరించిన 260 ఎకరాల్లో ముందుగా రైతుల కోసం 80 ఎకరాల్లో లే అవుట్ పనులు ప్రారంభించారు. 200 గజాల విస్తీర్ణంలో ప్లాటింగ్ చేసి రైతులందరికీ 80 అడుగుల రోడ్డు దగ్గర ఒకే చోట ప్లాట్లు ఇవ్వాలని రైతులు ఎమ్మెల్యే గంటాను కోరగా.. కమిషనర్ తేజ్ భరత్ అంగీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, వీఎంఆర్డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, జి. సుభాష్ చంద్రబోస్, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గంద్రెడ్డి స్వామినాయుడు, రమేష్, ఎర్ర రాజు, పాండ్రంగి అప్పలరాజు, లొడగల వెంకట్రావు, సత్య వరప్రసాద్, బలిరెడ్డి మల్లికార్జునరావు, మహంతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

**చంద్రంపాలెం హైస్కూల్ ఆట స్థలం పనులు పరిశీలన**

చంద్రంపాలెం హైస్కూల్ ఆట స్థలం పనులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వర్షం పడితే మైదానంలో నీరు నిలిచిపోతున్న నేపథ్యంలో ఆ సమస్య పరిష్కరించే దిశగా ఆయన చర్యలు తీసుకున్న విషయం విదితమే. సీఎస్ఆర్ కింద రూ. కోటి కేటాయించేలా దివీస్ సంస్థను ఒప్పించి ఆట స్థలాన్ని ఆధునీకరించడానికి శ్రీకారం చుట్టారు. ఆ పనుల ప్రగతిని పరిశీలించి.. నీరు నిలిచిపోకుండా అవసరమైన డిజైన్ రూపకల్పన చేయాలని సూచించారు. హైస్కూల్ లో అదనపు సౌకర్యాలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ వెంకట్రావు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గరే గుర్నాథ్, మన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలకు అండగా టీడీపీ

## పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, (చైతన్యరథం): గాజువాక నియోజకవర్గంలోని అనారోగ్యం తో బాధపడుతూ, కిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న సీనియర్ కార్యకర్త సింగిడి సింహాచలం గారిని గాజువాక శాసన సభ్యుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయం అందించేందుకు పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

## పాల్గొన్న మండల కమిటీ ఇన్చార్జులు

విజయనగరం, (చైతన్యరథం): విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు గంట పోలినాయుడు ఆధ్వర్యంలో దుప్పాడ గ్రామం గుంకలంగ్రామంలో ప్రజల సమస్యలు ప్రభుత్వం సంక్షేమ పథకాలు గురించి వివరించడం జరిగింది.. మండల కమిటీ యూనిట్ఇన్చార్జులు ముఖ్య నాయకులు మండల ప్రధాన కార్యదర్శి పాసి అప్పలనాయుడు. ఎంపీటీసీ వేచలాపు శ్రీనివాసరావు నడుపూరి రాంబాబు, గుంకలం నాయకులు పాల్గొన్నారు.



# కురుపాం ఎమ్మెల్యేతో అరకు పార్లమెంట్ ఇంచార్జి భేటీ

## నియోజకవర్గ సమస్యలపై చర్చ



పార్వతీపురం, (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిని మంగళవారం ఉదయం వారి క్యాంపు కార్యాలయంలో అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజోరు తేజోవతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు నేతలు సానుకూలంగా చర్చించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సమన్వయంతో కలిసి పనిచేయాలన్న సంకల్పాన్ని వారు ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ప్రాంత అభివృద్ధికి అవసరమైన అంశాలపై పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

# ప్రత్యేక పంచాయతీగా చిలకం

## గ్రామ సభలో ఎమ్మెల్యేను కోరిన ప్రజలు

పార్వతీపురం, (చైతన్యరథం): చిలకం గ్రామపంచాయతీ పునర్విభజనపై గ్రామసభ తీర్మానం కురుపాం ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇచ్చిన చిలకాం గ్రామ ప్రజలు.. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చిలకం గ్రామపంచాయతీ పరిధిలోని చిలకం, దత్తివలస, కారివలస గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు గ్రామపంచాయతీ పునర్విభజన అంశంపై గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం చిలకం గ్రామపంచాయతీ పరిధిలో చిలకం, దత్తివలస, కారివలస గ్రామాలు ఉండగా, గ్రామపంచాయతీ కార్యాలయానికి దత్తివలస, కారివలస గ్రామాలు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గ్రామసభలో పేర్కొన్నారు. దత్తివలస, కారివలస గ్రామాలు కలిపి సుమారు 260 ఇళ్లు ఉండగా, జనాభా సుమారు 1048 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం చిలకం గ్రామాన్ని విడిగా చిలకం గ్రామపంచాయతీగా, దత్తివలస కారివలస గ్రామాలను కలిపి నూతనంగా దత్తివలస గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామసభలో తీర్మానం ప్రతిపాదించబడింది. గ్రామసభకు హాజరైన సభ్యులు ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ తీర్మానం మేరకు మంగళవారం నాడు కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిని కలిసి గ్రామపంచాయతీ పునర్విభజనకు సంబంధించిన వినతి పత్రాన్ని చిలకాం గ్రామ పంచాయతీ ప్రజలు అందజేశారు.



# చీపురుపల్లిలో ఘనంగా బేబీ క్రిస్మస్ వేడుకలు

## ముఖ్య అతిథిగా తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్

చీపురుపల్లి, (చైత్యన్యరథం): స్థానిక బాయ్స్ హై స్కూల్ సమీపంలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం సాయంత్రం బేబీ క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,యువనాయకులు కిమిడి రామ మల్లిక్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ మల్లిక్ నాయుడు గారు మాట్లాడుతూ.. లోకరక్షకుడు జన్మించిన క్రిస్మస్ పర్వదినం శాంతికి, ప్రేమకు నిదర్శనమని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు ఎన్డీయే కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# కనువిందుగా మంగళగిరి ప్రీమియర్ లీగ్ -4 పోటీలు

## 3వ రోజు 10 జట్ల మధ్య 5 మ్యాచ్‌లు




మంగళగిరి, (చైతన్యరథం): రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(భోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -4 పోటీలు జోరుగా.. హుషారుగా కొనసాగుతున్నాయి. 3వ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 10 జట్ల మధ్య 5 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో జేకేసీ యూత్ వర్సెస్ పీసీ వైల్డ్ థండర్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో జేకేసీ యూత్ విజయం సాధించింది. రఫ్ రైడర్స్ చినకాకాని వర్సెస్ వారాహి వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో రఫ్ రైడర్స్ చినకాకాని జట్టు గెలుపొందింది. రైల్వే లైన్స్ వర్సెస్ యంగ్ స్టార్స్ సీకే మధ్య జరిగిన మాచ్ఛ్ లో రైల్వే లైన్స్ జట్టు,కేష్ట్ర బెటాలియన్ ఆూ్రఆూ వర్సెస్ రైజింగ్ స్టార్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో కేష్ట్ర బెటాలియన్ఆూ్రఆూ, టీమ్ భార్గవ పేట వర్సెస్ రన్ రైడర్స్ రెసిడెన్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో టీమ్ భార్గవ పేట జట్లు విజయం సాధించాయి. ప్రతీ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో రూ.మూడు వేల నగదు బహుమతి,ట్రోఫీ లను కూటమి నాయకులు అందజేశారు.ఈవెంట్ స్పాన్సర్లుగా సాయి పావని కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, బిజ్ 51, సోనోవిజన్, టల్ డి దేవ్, తాడేపల్లి మెడ్ స్టార్ హాస్పటల్స్, సిగ్నేచర్ డైన్, హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకోకోలా, వీ వైబ్ ఈవెంట్స్ వ్యవహరించనున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించడం జరుగుతుంది ప్రీమియర్ లీగ్ సీజన్-4 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలు మంగళాద్రి డెవెలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును వెలగపూడి కిషోర్ సహకారంతో అందించనున్నారు. అలాగే ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.3 వేలు జవ్వాది కిరణ్ చందు, ప్రతి మ్యాచ్ టాస్ విన్నర్‌కు సిల్వర్ కాయిన్, అలాగే ఫైనల్ మ్యాచ్ టాస్ విన్నర్‌కు గోల్డ్ కాయిన్ రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రానిక్ బైక్ వల్లభనేని భార్గవ్, బ్యాట్స్ మెన్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు ఎలక్ట్రికల్ బై సైకిల్ కాసరనేని జస్వంత్, బౌలర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు బై సైకిల్ గుత్తా కిషోర్, ఫీల్డర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలతో పాటు బైసైకిల్ తాడిబోయిన మహేష్, వికెట్ కీఫర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బై సైకిల్ షేక్ ఇంతియాజ్‌లు అందించనున్నారు. మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు టీ షర్ట్స్, ట్రాక్స్ అందజేస్తున్నారు







# నూతన ఏడాది క్యాలెండర్ విడుదల

## ఆవిష్కరించిన ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే వసంత ప్రసాద్

విజయవాడ, చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా, గొల్లపూడిలో నూతన ఏడాది 2026 క్యాలెండర్ను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్యాలెండర్లు రూపొందించగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, (చైతన్యరథం): వైసీబీ రాజేంద్రప్రసాద్. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఉయ్యూరు లోని సీబీఎం చర్చిలో ఏర్పాటుచేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యేసు ప్రభు చూపించిన మంచి మార్గంలో మనం అందరం నడుస్తూ, ఆయన చెప్పిన నీతి వ్యాఖ్యలు ఏవైతే ఉన్నాయో, మనల్ని మనం ప్రేమించిన్నట్లే ఎదుటివారి పట్ల కూడా అదే ప్రేమను చూపాలన్నారు. అలాగే ఎదుటివారు ఇబ్బందుల్లో ఉంటే మనం చేయగల సహాయం చేయాలని ఏసుప్రభు బైబిల్‌లో చెప్పి ఉన్నారని రాజేంద్రప్రసాద్ అన్నారు. తదుపరి రాజేంద్రప్రసాద్ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.




# హెచ్‌ఎమ్‌టీవీ క్యాలెండర్ విడుదల

## ఎమ్మెల్యే కళావెంకటరావు చేతుల మీదుగా ఆవిష్కరణ

రాజాం, (చైతన్యరథం): నేడు రాజాంలోని చీపురుపల్లి శాసనసభ్యుడు కిమిడి కళావెంకటరావు తన క్యాంప్ కార్యాలయంలో హెచ్.ఎమ్.టీవీ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్.ఎమ్.టీవీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జరుగుతున్న మార్పులను, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో హెచ్.ఎమ్.టీవీ ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే కళావెంకటరావు కొనియాడారు. వార్తా ప్రసారాల్లో విశ్వసనీయతను కాపాడుకుంటూ, ప్రజల పన నిలబడడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో హెచ్.ఎమ్.టీవీ మరెన్నో విజయాలు సాధించాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తూ ఛానల్ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో హెచ్.ఎమ్.టీవీ రిపోర్టర్లు, స్థానిక చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.




# 39 ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యం



## లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేసిన గిడ్డి ఈశ్వరి

పాడేరు, (చైతన్యరథం): మండలం కిండంగి పంచాయతీ సేరిబాయాలు గ్రామం లో 39 ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యంగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి మంగళవారం శంకుస్థాపన చేశారు. సోలార్ వ్యవస్థ ఆధారంగా నడిచే లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేయడం ఈ సందర్భంగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈశ్వరి గారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రైతుల మోముల్లో ఆనందాన్ని చూడడం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. దానిలో భాగంగానే భారతదేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆంధ్రప్రదేశ్లో మాత్రమే రైతులకు పంటసాయంగా ఏడాదికి రూ 20,000 అందిస్తున్నారన్నారు. జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకొని కిండంగిలో రైతులకు ఈ ప్రాజెక్టు ప్రారంభించడం శుభసూచికమన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎత్తిపోతల పథకాలన్నీ నిర్లక్ష్యంగా మారాయన్నారు. కనీసం సాగునీటి ప్రాజెక్టులు దేనిని కూడా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అనేక చెక్ డాములు శిథిలావస్థకు చేరుకున్నా సరే వాటిని కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని చెప్పారు. రాబోయే కాలంలో చంద్రబాబునాయుడు గారు ప్రతి ఎకరాకు నీరు అందించాలనే తపనతో ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కిండంగి సర్పంచ్ శ్రీమతి కూడ శ్రీలక్ష్మి, ఎంపీపీ రత్నకుమారి, టీడీపీ సీనియర్ లీడర్ జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, జుఖుఎం చైర్మన్ డప్పొడి వెంకటరమణ,తెలుగు యువత అధ్యక్షులు డుంబేరి విశ్వనాధ్ బుక్క జగదీశ్, జ్యోతి కిరణ్, ఇరిగేషన్ యవ అనుదీప్, కాంట్రాక్టర్ రాజేష్,పెసా కమిటీ సభ్యులు పాలవెల్లి, యువరాజు, కృష్ణంరాజు, భూపాల్, స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోన్-3
మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట
చైతన్యరథం

# ప్రగతిపథంలో ఏపీఎస్ ఆర్టీసీ

## గుడివాడ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నూతన భవన శంకుస్థాపనలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెల్లడి

గుడివాడ, (చైతన్యరథం): ప్రయాణికులు, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ... ఏపీఎస్ఆర్టీసీను తిరుగులేని స్థాయిలో నిలుపుతామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా రానున్న రోజుల్లో ఆర్టీసీలో పూర్తిగా విద్యుత్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నూతన భవన శంకుస్థాపన కార్యక్రమాలు మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. రూ. 6 కోట్ల నిధుల అంచనాలతో నిర్మించనున్న బస్టాండ్ నూతన భవన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని కూటమి నాయకులతో కలిసి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ముందుగా ప్రారంభోత్సవంలో పాల్గొన్నందుకు వచ్చిన చైర్మన్ కొనకళ్ళ, ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులకు మేళా తాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మితమవుతున్న బస్టాండ్ నమూనాను నాయకులు పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ గుడివాడ ప్రజల చిరకాల వాంఛ కూటమి ప్రభుత్వం తిరుస్తుందన్నారు. కొద్దిపాటి వర్షం వస్తేనే మోకాళ్ళ లోతు నీటిలో ప్రయాణికులు రాకపోకలు సాధించే దుస్థితి, బస్టాండులో ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం రాకతోనే సీఎం చంద్రబాబు, ఆర్టీసీ ఎండిను, నన్ను ఎమ్మెల్యే రాము పదేపదే కలుస్తూ.... బస్టాండ్ అభివృద్ధికి నిధులు సాధించుకున్నారని కొనకళ్ళ తెలిపారు. టెర్మినల్ తో పాటుగా, ఫ్లాట్ ఫామ్స్ నిర్మిస్తామని...ఇప్పుడున్న రోడ్డుకు రెండు అడుగుల ఎత్తు వరకు బస్టాండ్ నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. మోడల్ బస్టాండ్ గా గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ ను అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం అంత అవినీతి చేస్తూ, అన్ని రకాలుగా రా(ష్ట్రాన్ని దోచుకుని సర్వనాశనం చేసిందన్నారు. మాపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొనకళ్ళ నారాయణరావు ఉద్ఘాటించారు. మహిళల ఆశీస్సులతో ఉచిత బస్సు పథకం.. మా అంచనాలకు మించి సూపర్ డూపర్ హిట్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్నారనీ పేర్కొన్న కొనకళ్ళ రాష్ట్రంలో అన్ని బస్ స్టాండ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ ప్రజల భావోద్వేగంతో కూడుకున్న బస్టాండ్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన జరగడం ఆనందదాయకం అన్నారు. సోదరుడు కొనకళ్ళ నారాయణరావు ఆర్టీసీ చైర్మన్ అయిన తర్వాత గుడివాడ బస్టాండ్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అవుతున్న మొట్టమొదటి బస్టాండ్ గుడివాడదే కావడం కావడం గొప్ప విషయం అన్నారు. సమస్య చిన్నది అయినప్పటికీ, తీరడానికి 30 ఏళ్లు పట్టిందన్నారు. తాను విద్యార్థి దశలో ఉన్నప్పటినుండి బస్టాండ్ సమస్యను కళ్లారా చూసే వాడినని, కానీ యాదృచ్ఛికంగా తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడే సమస్య పరిష్కారం కావడం తనకు ఎంతో ప్రత్యేక మన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి గుడివాడలో ఏళ్ల తరబడి అపరిస్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసామన్నారు. సుదీర్ఘకాల బస్టాండ్ సమస్యను పరిష్కరించిన సోదరుడు కొనకళ్ళ నారాయణరావు సహకారాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని... ఆయనను గుడివాడ ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారని, గుడివాడ ఎమ్మెల్యే రాము అన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుకు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు. ప్రయాణికులకు సరిపోయే విధంగా ప్లాట్ ఫామ్స్ ను నిర్మించడంతో పాటుగా.... మరో 50ఏళ్ల వరకు తిరిగి చూసుకోకుండా గుడివాడ బస్టాండ్ ను మోడల్ బస్టాండ్ గా అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేయాలని కొనకళ్ళ నారాయణరావుకు ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. గుడివాడ బస్టాండ్ నిర్మాణ పనులను తాము ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తామని... గుడివాడ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అందరికీ సౌకర్యవంతంగా బస్టాండ్ అభివృద్ధి చేస్తామన్నారు. కంకిపాడు రోడ్డు సమస్య కూడా పరిష్కారం అయితే గుడివాడలో మేజర్ సమస్యలు పరిష్కరించినట్లు అవుతుందని సభా వేదికగా ఎమ్మెల్యే రాము అన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ... గత పాలకులు బస్టాండ్ అభివృద్ధి పేరుతో 7కోట్లు బిల్లు చేసుకొని ఎవరికి ఉపయోగం లేని పనులు చేసి వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ఎమ్మెల్యే రాము కృషితో ప్రజలందరికీ ఉపయోగపడేలా బస్టాండ్ నిర్మాణ పనులు నేడు ప్రారంభం కావడం సంతోషకరమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుజనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఆర్టీసీ ఈ.డి విజయరత్నం, ఈ.ఈ రాజశేఖర్, డి.ఈ కేశవరావు, గుడివాడ డిపో మేనేజర్ సునీల్ కుమార్ , కే.వెంకటేశ్వర్లు, గుడివాడ బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, గుడివాడ, రూరల్, నందివాడ మండలాల టీడీపీ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి బాబ్జి, డాక్టర్ గోర్జీ సత్యనారాయణ, సాయన పుష్పవతి, కొడాలి రామరాజు, అల్లాడ శ్రీనివాసరావు, రామిదేని వేణుబాబు, మజ్జాడ నాగరాజు, గోకవరపు సునీల్, యార్లగడ్డ సుధారాణి, కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ ఈడే మోహన్, చేకూరి జగన్మోహన్రావు, జనసేన నాయకులు సాయన రాజేష్, వేమూరి త్రినాథ్, సుంకర వెంకట్, కొండపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, తెలుగు మహిళలు, తెలుగు యువత అనుబంధ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.






తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖామాత్యులు ఎస్.సవితమ్మను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారానికి మంత్రి సవితకు వినతి పత్రాలు అందజేశారు.



## నోబెల్ టీచర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు ప్రారంభం

పెనమలూరు, (చైతన్యరథం): జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పెనమలూరు శాసనసభ్యుడు బోడే ప్రసాద్ నోబెల్ టీచర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో క్షేత్ర స్థాయిలో పాఠశాలల అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తూ విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆయన ప్రారంభించిన నోబుల్ టీచర్ అసోసియేషన్లో చేరి సంఘ అభివృద్ధికి పాటుపడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ కనకమేడల పేరిట పాఠశాలలో సైకిల్ స్టాండ్

## ప్రారంభించిన పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు, (చైతన్యరథం): నియోజకవర్గం ఉయ్యూరు మండలం ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో స్వర్గీయ కనకమేడల రంగారావు జ్ఞాపకార్థం 4 లక్షల రూపాయలతో బాలికల సైకిల్ స్టాండు షెడ్డు నిర్మాణ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, మాజీ సర్పంచ్, మాజీ ఎమ్మెల్యేగా ఉయ్యూరు ప్రజలకు అశేష సేవలందించిన స్వర్గీయ కనకమేడల రంగారావు జ్ఞాపకార్థం 50వ వర్ధంతి కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్ కుటుంబసభ్యులు పేదవర్గాలు చదువుకునే పాఠశాలలో షెడ్డు నిర్మాణం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో దాతలు ముందుకు రావాలని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువస్తూ యువతకు ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాంకేతిక పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయం కూడా అభివృద్ధి పథంలో దేశంలో గుర్తింపు పొందే స్థాయిలో ఉంటామన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉపాధ్యాయుల సారథ్యంలో మంచి ఉత్తీర్ణత పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనద్రీశ్వరరావు, మాజీ వైవీబీ రాజేంద్రప్రసాద్, జిల్లా తెదేపా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, కూనపరెడ్డి వాసు, డాక్టర్ కస్తూరమ్మ, డాక్టర్ పవన్ కళ్యాణ్, డాక్టర్, వెంకట్, డాక్టర్, ద్విజేంద్రబాబు, డాక్టర్, సుధాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# కూటమి పాలనలో ముత్తుకూరుకు మహర్దశ



## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సర్వేపల్లి, (చైతన్యరథం): 1200 మందికి శిక్షణ ఇచ్చేలా పోర్టులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇప్పటికే కృష్ణపట్నంలో కుట్టుశిక్షణతో కంప్యూటర్ ట్రైనింగ్ కేంద్రం చిన్నారులు బడికి వెళ్లేలా రెండు స్కూలు వ్యానులు ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా చెత్త తరలింపునకు రెండు వాహనాలు అదానీ ఫౌండేషన్ చొరవతో రూపుమారుతున్న కృష్ణపట్నం, ముత్తుకూరు పంచాయతీలు రెండు పంచాయతీల ప్రజల తరపున కంపెనీ ప్రతినిధులు, యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ముత్తుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. కృష్ణపట్నం, ముత్తుకూరు పంచాయతీలకు సోమిరెడ్డి సమక్షంలో నాలుగు వాహనాలను అప్పగించిన పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, రాజేష్ రంజన్, రామ్, వేణుగోపాల్ తదితరులు మీడియాతో సోమిరెడ్డి కామెంట్స్ అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అండ్ టీమ్ ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యువతలో వివిధ వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు 1200 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇది చాలా ఆనందాన్ని ఇచ్చే అంశం 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో 42 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా 2.30 లక్షల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ పై కక్షకట్టి నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక స్కిల్ డెవలెప్మెంట్ అంశం పూర్వవైభవం దిశగా సాగుతోందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం వద్ద 2 ఎకరాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం ఈ క్రమంలోనే అదానీ కృష్ణపట్నం పోర్టు కూడా శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. ఇప్పటికే కృష్ణపట్నం గ్రామంలోని తుఫాన్ షెల్టర్‌లో మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారని, కంప్యూటర్ ట్రైనింగ్ కూడా అందుబాటులోకి రాబోతోంది ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలకు నాలుగు వాహనాలకు అప్పగించడం శుభపరిణామమని అన్నారు. రెండు వాహనాలను చెత్త తరలింపునకు ఉపయోగించనున్నారని తెలిపారు. మరో రెండు వాహనాలను ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న చిన్నారులను బడికి తీసుకెళ్లి రావడానికి ఉపయోగించనున్నారని వెల్లడించారు. చలివేంద్ర నుంచి గిరిజన పిల్లలు 2.5 కిలోమీటర్లు నడిచి ముత్తుకూరు స్కూలుకు రావల్సివస్తుంది. వీరితో పాటు కృష్ణపట్నం చిన్నారులు బడికి వెళ్లేందుకు ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. ముత్తుకూరులో సైడ్ డ్రైన్ల నిర్మాణానికి రూ.2.65 కోట్లు కేటాయించారన్నారు. మొదటి దశలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పనులు ప్రారంభించారని తెలిపారు. రూ.2 కోట్లతో శ్మశానంలో అవసరమైన వసతులు కల్పించనున్నారు. రూ.1.19 కోట్లతో 345 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు మినీ స్టేడియం నిర్మాణానికి మొదటి విడతగా రూ.24 లక్షలు ఖర్చుపెడుతున్నారన్నారు. డంపింగ్ యార్డుకు రూ.30 లక్షలు ఖర్చు చేయబోతున్నారు కృష్ణపట్నంలోనూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మంచినీటి పథకం ఏర్పాటు చేయడంతో పాటు హైస్కూలులో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సోలార్ వీధిలైట్లు అందుబాటులోకి తెస్తున్నారు అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్, కార్పొరేట్ ఎఫైర్స్ రామ్, వేణుగోపాల్,మురళి, సాంబశివరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ సౌకర్యాలన్ని మనకు అందుబాటులోకి వస్తున్నాయి ప్రజలందరి తరపున అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యానికి, ప్రతినిధులందరికీ ధన్యవాదములు తెలియజేస్తున్నాను గిరిజన పిల్లలు బడికి వెళ్లడమే కష్టం.వారు రోజుకు రానుపోను 5 కిలోమీటర్లు నడిచివెళ్లడం ఇంకా కష్టసాధ్యం.. వారి కోసం పోర్టు యాజమాన్యం వ్యాను ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



విశాఖపట్టణం, (చైతన్యరథం): గోపాలపట్నం సెయింట్ ఆంథోనీ స్కూల్ లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు ఈ సందర్భంగా గణబాబు క్రిస్మస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కుమార్ టీచర్స్, ఐజిఎం పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్లు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## పేదల కష్టాల్లో అండగా సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, (చైతన్యరథం): పేదల పన కూటమి ప్రభుత్వం నిలుస్తుందని మరోసారి నిరూపిస్తూ, ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు భరోసా కల్పించారు. మంగళవారం రాత్రి గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 37 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా అందజేశారు. గన్నవరం క్యాంప్ కార్యలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య చికిత్సలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు ఈ సహాయం పెద్ద ఊరటనిస్తుందన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వమే ముందుండి అండగా నిలవాలన్న లక్ష్యంతో సీఎం సహాయనిధిని పారదర్శకంగా, వేగంగా అందజేస్తున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ, అవసరమైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.





## రైతన్నలు పంట మార్పిడితోనే లాభాలు : మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

మార్కాపురం, (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మూస పద్ధతిలో ఒకే పంటలు వేయకుండా పంట మార్పిడి పద్ధతులు ద్వారా లాభాలు గడించాలని సూచించారు. మిరప రైతులు తమ ఎండు మిరపకాయలను నేరుగా అమ్మకుండా ప్రభుత్వం అందించే సబ్సిడీ మిషన్లో పొంది మిరపకాయలు కారం పొడి చేసి తమ ఉత్పత్తులను అమ్మాలని అన్నారు. అదేవిధంగా కంది రైతులు కందులు నేరుగా అమ్మకుండా ప్రభుత్వం అందించే సబ్సిడీ మిషన్ల ద్వారా కందులను కందిపప్పుగా చేసి అమ్మాలని అన్నారు. అప్పుడు మార్కాపురం విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడు తన పుట్టినరోజున మార్కాపురం ప్రత్యేక జిల్లా ఇస్తానని మాట ఇచ్చారని ఆ మాటకు కట్టుబడి ఇప్పుడు మార్కాపురం జిల్లా ఇచ్చారని అన్నారు. కానీ వైసీపీ నాయకులు ప్రత్యేక మార్కాపురం జిల్లాపై కూడా విమర్శలు చేస్తున్నారని అప్పటి వైసీపీ ప్రభుత్వం లో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు నోరు ఎత్తని ఈ ఇదే వైసిపి నాయకులు అప్పుడు ఎక్కడికి పోయారని అన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఈ ప్రాంతాన్ని హార్టీ కల్చర్ హబ్‌గా మారుస్తామని తెలియజేశారు.

# సర్వాంగ సుందరంగా దర్శి పట్టణం లక్ష్యం : డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): దర్శి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైమాస్ లైట్స్ ప్రారంభోత్సవంలో టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ హాజరయ్యారు. మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మున్సిపల్ కమిషనర్ వై మహేష్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ దర్శిని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన దర్శి రూపురేఖలు మార్చే విధంగా అభివృద్ధి ఎజెండాగా 20 నెలల ప్రయాణం సాగుతుందని ఆమె వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్, మున్సిపల్ శాఖ మాత్యులు నారాయణ గారి సహకారంతో దర్శి పట్టణాన్ని అభివృద్ధి వైపు నడిపించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నానని ఆమె వివరించారు. వైసీపీ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ప్రజల నుండి నిధులు సేకరించి పట్టించుకోని టిటిడి కళ్యాణ మండపాన్ని తిరిగి పనులు ప్రారంభించి త్వరలో దర్శి



పట్టణానికి అంకితం చేయబోతున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమం ప్రజల అవసరాలు తీర్చే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరపాలక పంచాయతీగా ఉన్న దర్శిని థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకొని దాదాపు 5 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పనా ధ్యేయంగా అభివృద్ధి పనులు చేరవేగంతో జరుగుతున్నాయన్నారు.

శాశ్వత మంచినీటి అవసరాలు తీర్చే దిశగా ఇంటింటికీ కుళాయి లక్ష్యంగా అమృత పథకం త్వరలో దర్శి పట్టణ ప్రజలకు అంకితం చేయబోతున్నామన్నారు. మినీ స్టేడియం నిర్మాణం పార్కుల సుందరీకరణతో దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని డాక్టర్ లక్ష్మీ వివరించారు. దర్శి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు సమక్షంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా డాక్టర్ కడియాల లలిత్ సొంత నిధులతో మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టివెన్, కౌన్సిలర్ ఇత్తడి సునీత, దినకర్, కౌన్సిలర్లు, వార్డ్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు సంగా తిరుపతి రావు, కనకం శ్రీను, సానే సుబ్బయ్య, కర్ణ శ్రీను, వాసు, వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు , కూటమి శ్రేణులు ఉన్నారు.

# పంచాయతీ నిధులు పొదుపుగా వినియోగించాలి

## అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



రాప్తాడు, (చైతన్యరథం): పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఇష్టానుసారం ఖర్చుపెట్టి ఖజానా ఖాళీ చేసే ప్రయత్నాలు చేయవద్దని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల గురించి సమీక్ష చేశారు. నిధులు ఎంత మేర వచ్చాయి... ఇప్పటివరకు ఎంతవరకు ఖర్చు చేశారన్న విషయాల గురించి ఆరా తీశారు. అలాగే ఏ ఏ పనులకు ఎంత నిధులు వినియోగిస్తున్నారన్నది ఎమ్మెల్యే సునీత తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చిన నేపథ్యంలో కొందరు సర్పంచులు ఇష్టానుసారంగా నిధులు వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి వాటిని ఎంపీడీవోలు అడ్డుకోవాలని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే చేయాలని.. ముఖ్యంగా శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి రూపాయికి ఆధారాలు ఉండాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు నిధుల దుర్వినియోగానికి పాల్పడితే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఉన్న సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



**కొత్తచెరువులో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన జాబ్ మేళాలో ఎంపికైన 182 మంది అభ్యర్థులకు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్త చెరువు మండల కేంద్రంలోనీ శివ సాయి డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ బాబు, సీడ్ యాప్ జేడీఎం సూర్యనారాయణ, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.**

# అన్ని వర్గాలకూ కూటమి సుపరిపాలన

చింతలూరు, (చైతన్యరథం): సుపరిపాలన అందిస్తుందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన విద్య వైద్య సేవలను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ి తెలిపారు..ఃఃదుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





# కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటీ

విజయనగరం, (చైతన్యరథం): విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి గారుని ఈరోజు వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శాసనసభ్యుడు రంగారావు (బేబీ నాయన) కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు అంశాలపై చర్చించడం జరిగింది. అనంతరం, జాయింట్ కలెక్టర్ ఎస్ సేతుమాధవన్ గారుని కలిసి ధాన్యం సేకరణ గురించి మరియు ఇతర అంశాలపై చర్చించారు.



## అంతర్గత రహదారులకు శంకుస్థాపన

ఉంగుటూరు, (చైతన్యరథం): అర్ధవరం గ్రామంలో 35 లక్షల జెడ్పీపీ నిధులతో చేపట్టనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం అవిష్కరించిన ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు గారు, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ గారు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు గారు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణం రాజు గారు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వాసురాజు గారు. ముందుగా గ్రామంలో వెంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన నాయకులు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే అధోగతే

## వైసీపీ మూకలకు రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్ ధరూరు శ్రీనివాసులు హితవు

అమరావతి, (చైతన్యరథం): రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వైపు నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ మరొకవైపు సీమాంధ్ర ద్రోహులు, సీమాంధ్ర దోపిడీదారులు,సీమాంధ్ర గుండాలని తెలంగాణ ప్రజల్లో ద్వేషం ఏర్పడేలాచేసి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి 9 ఏళ్లపాటు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చలేకపోయిన విషయాన్ని గ్రహించిన ప్రజలు, ఓడించటాన్నీ జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరును ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై విమర్శలు చేయటం సిగ్గుచేటని రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్ అంబేద్కర్ దళిత నిరుపేద సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధరూరు శ్రీనివాసులు విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను ఏనాడు పట్టించుకోని జగన్ మోహన్ రెడ్డి, గుడివాడ అమర్నాథ్ లాంటి నీచులు కేసీఆర్ మాటలను సమర్థిస్తూ వారి రాజకీయ ప్రయోజనాలకోసం ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మాబినాన్ని దెబ్బతీసేవిదంగా మాట్లాడటం వారి దిగజారుడు రాకీయాలకు అద్దంపడుతోందన్నారు. నిత్యం ఆంధ్రప్రదేశ్‌పై విషం కక్కకే ముసలి కుక్కకి మద్దతుగా నిలవటం ఎంతవరకు సమంజసమో ఆలోచించవలసిందిగా రాష్ట్ర ప్రజలకు మనవిచేశారు.

బీఆర్ఎస్ హాయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కొన్ని కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో వారు పాల్పడిన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవటం కోసం, తెలంగాణా ప్రజల దృష్టి మార్చటం కోసం ఫాం హౌస్ నుంచి బయటకువచ్చిన తాగుబోతు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు ప్రస్తావించడం నీచాతి నీచమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని తక్కువగా చేసి చూపించే ప్రయత్నం చేస్తూ మాట్లాడటం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను కించపరటం ఔతుందన్నారు. రాష్ట్ర విభజనవల్ల పూర్తిగా నష్టపోయి రాజదాని లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంకోసం 2014 నుండి 2019 వరకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎంతగానో శ్రమించారన్నారు. 16, 500 కోట్ల లోటు బడ్జెట్‌తో, కేవలం సింగిల్ డిజిట్‌కే పరిమితమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2014 నుండి 2019 వరకు శ్రమించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన ఒక గొప్ప నాయకుడు చంద్రబాబు అన్నారు. 5 ఏళ్లపాటు చంద్రబాబు గారు చేసిన అభివృద్ధిని పూర్తిగా నాశనం చేస్తూ 2019 నుండి 2024 వరకు జగన్ మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికీ రాజధాని లేకుండా చేసి, రాష్ట్రం నుండి పెట్టుబడులు పరిశ్రమలను తన్ని తరిమేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా పతనం చేశాడన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారిచేస్తే మరోసారి రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో కూటమి ప్రభుత్వ సారధిగా రాష్ట్ర ముఖ్యంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధిచేస్తూ భావితరాలభవిష్యత్తుకు పునాదివేస్తూ ఉంటే తాగుబోతు కేతో చేతులు కలిపి విశ్వాసఘాతకుడైన జగన్ మోహన్ రెడ్డి కి చెందిన నాయకులు కేసీఆర్ మాటలకు మేము మద్దతిస్తున్నామని మాట్లాడటం ఎంతవకు సమంజసమో రాష్ట్ర ప్రజలు ఆలోచించవలసిందిగా మనవిచేస్తున్నానన్నారు.



## ఒడిశాలో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించడమే కాకుండా ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆర్థికసాయాన్ని మరింత పెంచుతామంటూ ఒడిశా ప్రభుత్వం చేసిన ప్రకటన సత్ఫలితాలను ఇస్తోంది. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటలకే ప్రభుత్వం ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మంగళవారం మల్కాన్‌గిరి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వీరందరిపై రూ. 1.89 కోట్ల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను డీజీపీ వెల్లడిస్తారని తెలిపారు. మావోయిస్టులు లొంగిపోతే ఛత్తీస్‌గడ్ అందజేస్తున్న రివార్డు కన్నా 10 శాతం ఎక్కువ అందజేస్తామని సోమవారం మోహన్‌దాస్ మాంజీ ప్రభుత్వం ప్రకటించింది.

## పులుల పట్టివేతకు ఆపరేషన్ బీస్ట్



చామరాజనగర జిల్లాలో ఇటీవల పులుల దాడులు పెరిగిన నేపథ్యంలో పులుల పట్టివేతకు అటవీశాఖ ఆపరేషన్ బీస్ట్ ఆపరేషన్ చేపట్టింది. భీమనబీడు చుట్టుపక్కల ప్రాంతాలలో అధికారులు మకాం వేశారు. బండీపుర పులుల అభయారణ్య సిబ్బంది కూంబింగ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో పులుల సంచారాన్ని గుర్తించనున్నారు. నంజేదేవర గ్రామంలోని ఓ క్వారీలో ఐదు పులులు ఉన్నట్లు గుర్తించారు. కాగా కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు.

## కేరళలో 24, ఛత్తీస్‌గడ్‌లో 27 లక్షల ఓట్ల తొలగింపు



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండో విడత ఎన్నికల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా కేరళ, ఛత్తీస్‌గడ్ ముసాయిదా ఎన్నికల జాబితాను ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. కేరళలో 24 లక్షల మంది, ఛత్తీస్‌గడ్‌లో 27 లక్షల మంది పేర్లను తొలగించింది. అన్ని రాజకీయ పార్టీలకు ప్రతులను షేర్ చేశామని వెల్లడించింది.

# దీపూదాస్‌ను అన్యాయంగా చంపేశారు

- తప్పుడు అభియోగాలు మోపి హతమార్చారు
- బతికున్నంతకాలం న్యాయం కోసం కృషిచేస్తా
- ప్రవక్తను అవమానించినట్లు ఆధారాలు లేవు
- కుటుంబసభ్యులు గుండెనిబ్బరం చేసుకోవాలి
- ఆడియో సందేశంలో షేక్ హసీనా

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపూదాస్‌ను మత ఛాందస వాదులు అత్యంత పాశవికంగా పొట్టనపెట్టుకోవడంపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. న్యూఢిల్లీలోని బంగ్లా హైకమిషన్ కార్యాలయం వద్ద వీహెచ్‌పీ, పలు హిందూ సంస్థల కార్యకర్తలు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీపూదాస్‌పై మూకదాడి ఘటనను పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దీపూదాస్‌పై తప్పుడు అభియోగాలు మోపారని, మహమ్మద్ ప్రవక్తను ఆయన అవమానించినట్టు ఎలాంటి ఆధారాలు లేవని షేక్ హసీనా ఒక ఆడియో ప్రకటనలో పేర్కొన్నారు. అదొక్కటే కాదు..ఇంత పాశవికంగా దీపూదాస్‌ను హత్య చేసిన వ్యక్తులు ఎక్కడి నుంచి వచ్చారు? అని ప్రశ్నించారు. దీపూదాస్ కుటుంబసభ్యులు గుండెనిబ్బరం చేసుకోవాలని, తాను బతికున్నంత వరకూ ఈ దారుణ ఘటనపై న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



### ఉద్యమం ఉధృతం చేస్తాం

బంగ్లాదేశ్‌లో దీపూదాస్ దారుణ హత్యపై ఆ దేశంలోనే కాకుండా ఢిల్లీ నుంచి ఖాట్మండు వరకూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ కార్యాలయానికి మంగళవారం ఉదయం పెద్దఎత్తున నిరసనకారులు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీపూదాస్ హంతకులను యూనస్ ప్రభుత్వం శిక్షించకుంటే మరింత పెద్ద ఉద్యమం చేపడతామని నిరసనకారులు హెచ్చరించారు. విద్యార్థుల ఆందోళనతో గత ఏడాది పదవీచ్యుతురాలైన షేక్ హసీనా అప్పట్నించి భారతదేశంలోని అజ్ఞాత ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న పార్లమెంటు ఎన్నికలు జరగాల్సి ఉండగా, షేక్ హసీనా పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా యూనస్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ బంగ్లాలో కాల్పులు, పాశవిక హత్యలు, హింసాకాండలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

# ఢిల్లీ బంగ్లా హైకమిషన్ ఎదుట నిరసన

### - హిందువులపై దాడికి ఖండన



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంగ్లాలో హిందువులపై దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున బంగ్లా హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు హైకమిషన్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రదర్శకులు బారికేడ్లను నెట్టుకుని లోపలకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఢాకాలో జరిగిన ఘటనను నిరసిస్తూ ప్రదర్శకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వీహెచ్‌పీతో పాటు పలు హిందూ సంస్థలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నాయి. బంగ్లాదేశ్‌లోని మయమన్ సింగ్ జిల్లాలో గత వారం దీపూ చంద్ర దాస్ అనే 25 ఏళ్ల హిందూ యువకుడిని దుండగులు గత వారంలో దారుణంగా కొట్టిచంపారు. చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై పడేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ దేశాలు సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. దీపూ చంద్రదాస్ దారుణ హత్యతో ప్రమేయమున్న 12 మందిని బంగ్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వం గద్దెదిగడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన షరీఫ్ ఒస్మాన్ హాదీపై గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల కాల్పులు జరపడం, సింగపూర్‌లో చికిత్స పొందుతూ అతను కన్నుమూయడంతో దేశ వ్యాప్తంగా హింసాకాండ చెలరేగింది. దీనికి కొనసాగింపుగా నేషనల్ సిటిజన్ పార్టీ యువనేత మొతలేబ్ సిక్దార్‌పై సోమవారం గుర్తుతెలియని సాయుధుడు కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో అతని తల ఎడమ వైపు తూటా దూసుకెళ్లింది. ప్రస్తుతం ఆసుపత్రిలో సిక్దార్ చికిత్స పొందుతున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.








శ్రీహరికోటలో ఇస్రోకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్ 2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మిషన్ మోసుకెళ్లే ఎల్‌వీఎం3 ఎం6 వ్యోమనౌక ప్రయోగం బుధవారం జరగనుంది.

ఉత్తరాదిన పొగమంచు తీవ్రతతో మంగళవారం తెల్లవారుజామున లక్నో-వారణాసి హైవే, అమేథీ జిల్లాలోని హైవేపై వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో 16 మంది గాయపడ్డారు.



## వేగంగా గ్రీన్‌కార్డుల ప్రక్రియ

# హెచ్-1బీ స్టాఫ్‌కి గుడ్‌న్యూస్ చెప్పిన గూగుల్

తాత్కాలిక వీసాలపై అమెరికాలో పనిచేస్తూ శాశ్వత నివాసం కోసం ఎదురుచూస్తున్న విదేశీ ఉద్యోగులకు టెక్ దిగ్గజం గూగుల్ గుడ్‌న్యూస్ చెప్పింది. వచ్చే ఏడాది తమ సంస్థలో పనిచేసే హెచ్-1బీ ఉద్యోగులకు 'గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్ ప్రక్రియ'ను వేగవంతం చేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఇంటర్నల్ న్యూస్ లెటర్ ఉద్యోగులకు దీనిపై సమాచారం ఇచ్చినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అర్హత కలిగిన ఉద్యోగులకు సంబంధించి 2026లో పీఈఆర్ఎం దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు గూగుల్ వెల్లడించినట్లు తెలుస్తోంది.

పీఈఆర్ఎంకు అర్హత సాధించిన ఉద్యోగులకు వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో గూగుల్ ఇమిగ్రేషన్ చట్ట సంస్థలనుంచి పిలుపు అందుతుందని కంపెనీ తమ ఇంటర్నల్ మెమోలో పేర్కొన్నట్లు సదరు కథనాలు తెలిపాయి. అయితే, ఈ ప్రణాళిక గురించి గూగుల్ బహిరంగ ప్రకటనేదీ చేయలేదు. కానీ, ట్రంప్ కఠిన వలస విధానాలు, వీసా ఫీజులు, సోషల్ మీడియా వెట్టింగ్ నిబంధనల వేళ.. టెక్ దిగ్గజం నిర్ణయం అనేకమంది హెచ్-1బీ ఉద్యోగులకు ఊరట..!

**ఏంటి పెర్మ్ ప్రక్రియ..?**

అమెరికా ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డుల జారీ ప్రక్రియలో 'ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్'ది కీలక పాత్ర. దీన్ని టెక్ కంపెనీలు ఎక్కువగా వినియోగిస్తాయి. తమ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు శాశ్వత నివాసం దక్కేలా సాయం చేస్తుంటాయి. పెర్మ్ ఆమోదం లభించిన తర్వాతే సదరు ఉద్యోగి తన గ్రీన్ కార్డు ప్రక్రియలో ముందుకెళ్లేందుకు అవకాశం లభిస్తుంది. అయితే, ఇందుకు చాలా షరతులుంటాయి. సంబంధిత విదేశీ ఉద్యోగిని నియమించుకోవడం వల్ల అమెరికా వర్కర్లపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని కంపెనీలు నిరూపించాల్సి ఉంటుంది. అంతేకాదు.. ఆ ఉద్యోగానికి అర్హత కలిగిన అమెరికన్లు అందుబాటులో లేరని రుజువు చేయాలి. దీనివల్లే చాలా కంపెనీలు లేఆఫ్‌లు లేదా నియామకాలు నెమ్మదించిన సమయంలో పెర్మ్ దరఖాస్తులకు సంబంధించి జాగ్రత్తగా వ్యవహరిస్తుంటాయి. లేఆఫ్‌లు ఎక్కువగా ఉన్న సమయంలో విదేశీ ఉద్యోగులకు పెర్మ్ నిబంధనల ప్రకారం స్పాన్సర్షిప్ ఇవ్వడాన్ని సమర్థించుకోవడం కంపెనీలకు కష్టతరంగా మారుతుంది. 2023 జనవరిలో గూగుల్ ప్రపంచవ్యాప్తంగా 12వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. ఆ సమయంలో పెర్మ్ దరఖాస్తు ప్రక్రియను నిలిపివేసింది. ఆ ఏడాది అమెజాన్, మెటావంటి సంస్థలు కూడా ఇదేవిధంగా వ్యవహరించాయి. గత ఏడాదిలో గూగుల్ చాలా స్వల్ప సంఖ్యలో పెర్మ్ దరఖాస్తులను ఫైల్ చేసింది. అయితే, 2026నుంచి ఈ ప్రోగ్రాంను వేగవంతం చేయాలని గూగుల్ భావిస్తోంది.




అయితే, గూగుల్‌లో పనిచేసే ప్రతి విదేశీ ఉద్యోగి ఈ పెర్మ్‌కు అర్హత సాధించలేరు. ఇందుకు కంపెనీ కొన్ని షరతులు విధించింది. డిగ్రీతోపాటు పని అనుభవాన్నీ పరిగణలోకి తీసుకుంటారు. ఇక, గూగుల్ ఆఫీసులకు వచ్చి పనిచేసే ఉద్యోగులకే ఈ ప్రోగ్రామ్ వర్తిస్తుంది. రిమోట్‌గా ఉండి పనిచేసే వారిని పెర్మ్ అర్హతకు పరిగణించాలంటే వారు కచ్చితంగా తమ నివాస ప్రదేశాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. సీనియార్టీ, పనితీరు కూడా ఇక్కడ కీలక పాత్ర పోషిస్తుందని. గూగుల్ తమ మెమోలో పేర్కొన్నట్లు సమాచారం.

## ఆఫర్ పెంచిన అమెరికా!

- స్వచ్ఛందంగా వీడే అక్రమ వలసదారులకు
- 3వేల డాలర్ల స్టైఫండ్ ఇవ్వాలని నిర్ణయం

అక్రమ వలసదారులను దేశంనుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్ల (సుమారు రూ.2.68 లక్షలు)కు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించాల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు వారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది.

ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు. డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరినుంచి 19 లక్షలమంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేలమంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించుకున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5 లక్షలమందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు.




## వేతన ఆధారంగా హెచ్-1బీ

**ప్రతిపాదనలకు 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' తుది మెరుగులు**




విదేశీ ఉద్యోగులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఎంపికకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలపై తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతన ఆధారిత లాటరీ వ్యవస్థ నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తోంది. ఈమేరకు ఇమిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్ నివేదికను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఫెడరల్ నిబంధనల మార్పుల ప్రక్రియలో ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ సమీక్షను చివరిదశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారుచేసి వాటిని ప్రకటిస్తారు. వీలైనంత త్వరగా సమీక్షను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించిన అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాదినుంచే హెచ్-1బీ వీసాల జారీకి కొత్త నిబంధనలను అమలుచేయాలని అమెరికా సర్కారు భావిస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం ఈ మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా.. ఇకపై వెయిటెడ్ సెలక్షన్ సిస్టంను ప్రవేశపెట్టనున్నారు. దీని ప్రకారం.. ఉద్యోగి వేతనస్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడంవంటివి చేయనున్నారు. అంటే.. ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసాలు ఎక్కువగా దక్కే అవకాశముంది.

## కొత్తగా వంద ఐసీబీఎంల మోహరింపు

**-చైనాపై పెంటగాన్ ముసాయిదా నివేదిక**

**అణు నిరాయుధీకరణపై ఆసక్తి చూపటం లేదంటూ విమర్శ**




ఆయుధాల నియంత్రణ చర్చలపై చైనా ఎలాంటి ఆసక్తి చూపడం లేదని అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది. కొత్తగా మూడు వేర్వేరు ప్రాంతాల్లో 100 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను మోహరించి ఉండొచ్చని పేర్కొంది. మరే అణుశక్తి దేశం చేయనివిధంగా డ్రాగన్ ఆయుధాలు సమకూర్చుకుంటోందని, అణు, సైనికపరమైన మౌలిక సదుపాయాలను వేగంగా ఏర్పాటు చేస్తోందని వెల్లడించింది. ఈమేరకు యూఎస్ రక్షణశాఖ కేంద్ర కార్యాలయం పెంటగాన్ ముసాయిదా నివేదికను వెలువరించింది. పెంటగాన్ అంచనా ప్రకారం.. మంగోలియాతో ఉన్న సరిహద్దు సమీపంలో మూడు సిలో ఫీల్డ్స్ (విశాలంగా ఉండే పొడవైన నిర్మాణం)లో 100 వరకు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను మోహరించి ఉండొచ్చని పేర్కొంది. ఈ సిలో సైట్ల గురించి గతంలోనే వెల్లడించినప్పటికీ.. అప్పుడు అక్కడ మోహరించిన క్షిపణుల సంఖ్యను ప్రస్తావించలేదు. 2024లో చైనా వద్ద అణు వార్‌హెడ్ల సంఖ్య 600కు మించలేవని, 2030 నాటికి వాటి సంఖ్య 1000 దాటొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. "ఆయుధ నియంత్రణ చర్చల విషయంలో చైనా ఎలాంటి ఆసక్తి చూపించడం లేదు" అని నివేదిక పేర్కొంది.

ఈ నివేదికపై చైనా స్పందించింది. ఈ అంచనాలను తోసిపుచ్చింది. తన దేశాన్ని కించపరచడానికి, అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు అమెరికా ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న తప్పుడు ప్రచారమని వాషింగ్టన్‌లోని చైనా దౌత్య కార్యాలయం ఈ నివేదికను ఖండించింది. తన దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని కనీసస్థాయిలో మోహరింపులు కొనసాగిస్తుందని స్పష్టం చేసింది. ఇదిలాఉంటే.. చైనా, రష్యాతో అణునిరాయుధీకరణ చర్చలు జరిపే అవకాశం ఉందని కొన్ని వారాల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ చర్చలపై చైనా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పెంటగాన్ నివేదిక వచ్చింది.

## చెప్పిన సమయానికే ఎన్నికలు

**ఎక్స్ పోస్టులో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్**



గతేడాది బంగ్లాదేశ్లో జరిగిన విద్యార్థుల ఆందోళనల్లో కీలక పాత్ర పోషించిన ఇంకిలాబ్ మోంచో నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణంతో దేశంలో అశాంతి నెలకొంది. ఈ క్రమంలో దేశ తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్ జరగబోయే ఎన్నికల గురించి కీలక ప్రకటన చేశారు. సకాలంలోనే ఎన్నికలు జరుగుతాయని భారత్‌లోని అమెరికా దౌత్యవేత్త సెర్గియో గోర్‌కు హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాలో ఎన్నికలు జరగనున్నాయి. సెర్గియోతో ఫోన్‌లో మాట్లాడినట్లు యూనస్ ఎక్స్ వేదికగా తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలనే నిబద్ధతను పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు. మాజీ ప్రధాని షేక్ హసీనా పాలన గురించి ప్రస్తావిస్తూ.. 'నిరంకుశ పాలన సమయంలో దొంగలించిన తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు' అని యూనస్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో ఎన్నికల ప్రక్రియను అంతరాయం కలిగించేందుకు పదవి కోల్పోయిన (హసీనాను ఉద్దేశిస్తూ) వారి మద్దతుదారులు మిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. దేశం విడిచి పారిపోయిన వారు హింసను ప్రేరేపిస్తున్నారన్నారు. అన్ని సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తాత్కాలిక ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికలకు ఇంకా దాదాపు 50 రోజులు ఉన్నాయని.. స్వేచ్ఛగా, న్యాయంగా, శాంతియుతంగా వీటిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

# చెలరేగిన షెఫాలీ

- చిత్తుగా ఓడిన శ్రీలంక
- భారత మహిళలకు వరుసగా రెండో విజయం
- ఐదు టీ 20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యం

శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం విశాఖలో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. షెఫాలీ వర్మ (69 నాటౌట్: 34 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగడంతో 129 పరుగుల లక్ష్యాన్ని భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్ (26), స్మృతి మంధాన (14), హర్మన్ ప్రీత్ కౌర్ (10) పరుగులు చేశారు. షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. భారత బౌలర్లు విజృంభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. ఆ జట్టులో హర్షిత (33) టాప్ స్కోరర్. చమరి ఆటపట్టు (31), హాసిని పెరీరా (22) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీచరణి 2, వైష్ణవి శర్మ 2, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా ఒక్కో వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు తొలి ఓవర్లోనే షాక్ తగిలింది. క్రాంతిగౌడ్ బౌలింగ్‌లో తొలి ఓవర్ చివరి బంతికి విష్మి గుణరత్నే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. మరోవైపు క్రీజులో ఉన్న కెప్టెన్ చమరి ఆటపట్టు (31: 3 ఫోర్లు, 2 సిక్సులు).. క్రాంతి గౌడ్ వేసిన మూడో ఓవర్లో ఒక ఫోర్, సిక్స్, అరుంధతీ రెడ్డి బౌలింగ్‌లో ఒక ఫోర్, సిక్స్ కొట్టి దూకుడు ప్రదర్శించింది. అయితే స్నేహ్ రాణా వేసి ఆరో ఓవర్ మూడో బంతికి ఆటపట్టు క్యాచ్ అవుట్‌గా పెవిలియన్ చేరింది. వైష్ణవి వేసిన ఎనిమిదో ఓవర్లో హర్షిత హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడింది. 10 ఓవర్లు ముగిసే శ్రీలంక రెండు వికెట్ల నష్టానికి 66 పరుగులతో నిలిచింది. బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో ఆ జట్టు పరుగులు తీయడానికి కష్టపడింది. ఈ క్రమంలో శ్రీ చరణి బౌలింగ్‌లో హాసిని పెరీరా క్యాచ్ ఇచ్చి ఔటైంది. శ్రీ చరణి బౌలింగ్‌లోనే హర్షిత (33: 32 బంతుల్లో 4 ఫోర్లు) రనౌట్ అయింది. 18వ ఓవర్ తొలి బంతికి నీలాక్షి డిసిల్వా (2) ఔట్ కాగా, ఆతర్వాతి ఓవర్లో శ్రీచరణి బౌలింగ్‌లో కవిశా పెవిలియన్ చేరింది. ఇక చివరి ఓవర్లో శ్రీలంక మూడు వికెట్లు కోల్పోయింది. ఇందులో రెండు రనౌట్లు ఉన్నాయి. ఈ గెలుపుతో భారత్ 2-0 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. విశాఖలోనే జరిగిన మొదటి టీ 20 మ్యాచ్‌లోనూ భారత మహిళలు గెలుపొందిన విషయం తెలిసిందే.






## అరుదైన ఘనతకు ఒక్క పరుగు దూరంలో..

*టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ దాదాపు 15 ఏళ్ల తర్వాత దేశవాళీ టోర్నీలో ఆడుతున్నాడు. బుధవారం నుంచి జరిగే విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున విరాట్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ జట్టుకు టీమిండియా స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఒక్క పరుగు చేస్తే అరుదైన ఘనత సాధిస్తాడు.*

*అంతర్జాతీయ వన్డే కెరీర్‌లో కోహ్లీ ఇప్పటి వరకు 14,557 పరుగులు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఓవరాల్‌గా 15,999 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆంధ్రతో బుధవారం జరిగే మ్యాచ్‌లో మరో పరుగు చేస్తే.. లిస్ట్-ఏ క్రికెట్‌లో 16వేల పరుగులు మైలురాయిని అందుకుంటాడు. దీని ద్వారా ఈ ఫీట్ అందుకున్న భారత రెండో క్రికెటర్‌గా నిలుస్తాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో సచిన్ 21,999 పరుగులు సాధించాడు. కాగా వన్డేలతో పాటు విజయ్ హజారే ట్రోఫీ, భారత్-ఏ, జోనల్ జట్ల తరఫున సాధించిన పరుగులను లిస్ట్-ఏ జాబితాలో చేర్చుతారు.*

## ఒకే ఓవర్లో ఐదు వికెట్లు

### టీ20ల్లో ఇండోనేషియా బౌలర్ రికార్డ్




ఇండోనేషియా బౌలర్ గ్రెడే ప్రియాందన సంచలనం సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్లో ఏకంగా 5వికెట్లు తీసిన తొలి క్రికెటర్‌గా సరి కొత్త చరిత్ర సృష్టించాడు. కంబోడియాతో జరిగిన మ్యాచ్‌లో తాను వేసిన తొలి ఓవర్లోనే ప్రియాందన ఈ ఘనత సాధించడం మరో విశేషం. బాలి వేదికగా ఇండోనేషియా- కంబోడియా మధ్య మంగళవారం తొలి టీ20 మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో కంబోడియా 15 ఓవర్లకు 106/5 వద్ద పటిష్టంగానే కన్పించింది. దీంతో ఇండోనేషియా జట్టు కెప్టెన్ 16వ ఓవర్లో కుడిచేతి వాటం బౌలర్ ప్రియాందనను బౌలింగ్‌కు తీసుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో అతడికి ఇదే తొలి ఓవర్. మెరుపుల్లాంటి బంతులతో కంబోడియా బ్యాటర్లను వణికించాడీ బౌలర్. తొలి మూడు బంతుల్లో ముగ్గురిని పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించిన ప్రియాందన.. తర్వాతి బంతిని డాట్‌బాల్‌గా వేశాడు. అనంతరం మిగిలిన రెండు బంతుల్లో మరో ఇద్దరిని ఔట్ చేయడంతో కంబోడియా పోరాటం ముగిసింది. ఈ ఓవర్లో చివరి రెండు వికెట్ల మధ్య వైడ్ రూపంలో కంబోడియాకు ఒక పరుగు దక్కింది. 107 పరుగులకు ఆలౌట్ అయిన కంబోడియా జట్టు.. 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇదే మ్యాచ్లో ఇండోనేషియా ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన ప్రియాందన.. 11 బంతుల్లో 6 పరుగులు చేసి నిరాశపర్చాడు. కానీ, బంతితో మాత్రం అదరగొట్టి.. అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకూ ఏ క్రికెటర్‌కు సాధ్యం కాని రికార్డును సృష్టించాడు. గతంలో ఇలాంటి ఫీట్ దేశవాళీ టీ20ల్లో రెండుసార్లు నమోదైంది. 2013-14లో విక్టరీడే టీ20 కప్‌లో భాగంగా యూసీబీ- బీసీబీ ఎలెవన్ జట్టు తరపున బంగ్లాదేశ్ ఆటగాడు అల్ అమీన్ హొస్సేన్ ఒకే ఓవర్లో 5 వికెట్లు తీశాడు. ఇక, 2019-20లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సెమీఫైనల్లో కర్ణాటక ఆటగాడు అభిమన్యు మిథున్ హర్యానాపై ఈ ఘనత సాధించాడు. కానీ, అంతర్జాతీయ క్రికెట్లో మాత్రం ప్రియాందనదే తొలి రికార్డ్. కాగా ఇప్పటివరకు 14 సార్లు ఒకే ఓవర్లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలున్నాయి. చెలరేగిన షెఫాలీ

## 'చిన్నస్వామి' నుంచి మ్యాచ్‌లు తరలింపు



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో నిర్వహించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా కర్ణాటక ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో బుధవారం ఆంధ్ర- ఢిల్లీ మ్యాచ్ బీసీసీఐ సీఓఈలో ప్రారంభం కానుంది. చిన్నస్వామి మైదానంలో ప్రేక్షకులు లేకుండా పోటీ నిర్వహిస్తామని కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ ప్రతిపాదించారు. దీనికి కర్ణాటక పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా పోటీల వేదికను మార్చారు. ఇప్పటికే విరాట్ కోహ్లీ తదితర కీలక ఆటగాళ్లు బెంగళూరు చేరుకుని ప్రాక్టీస్ ప్రారంభించడం గమనార్హం. దీంతో 15 ఏళ్ల తరువాత కోహ్లీ ఆడుతున్న విజయ్ హజారే మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలనుకుంటున్న అభిమానులు తీవ్రంగా నిరాశ చెందారు.

ఐపీఎల్- 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో జరిపిన విజయోత్సవ సంబరాల్లో తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అప్పటినుంచి చిన్నస్వామి మైదానంలో ఎలాంటి మ్యాచ్‌లు నిర్వహించలేదు.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో దీప్తి శర్మ




భారత మహిళా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త రికార్డు నెలకొల్పింది. తొలిసారిగా ఐసీసీ టీ20 అంతర్జాతీయ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి అగ్రస్థానంలో నిలిచింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో దీప్తి చేసిన అద్భుత ప్రదర్శన ఆమెను అగ్రస్థానానికి చేర్చింది. విశాఖపట్నంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టిన దీప్తి, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఐదు రేటింగ్ పాయింట్లు సంపాదించింది. దీంతో ఆస్ట్రేలియా బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్‌ను వెనక్కు నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం దీప్తి కేవలం ఒక పాయింట్ తేడాతో టాప్‌లో కొనసాగుతోంది. ఆగస్టు నుంచి నంబర్‌వన్‌గా ఉన్న సదర్లాండ్ తాజాగా రెండో స్థానానికి పరిమితమైంది.

**బ్యాటింగ్‌లో లారా..**

వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ మళ్లీ నంబర్‌వన్ స్థానాన్ని తిరిగి దక్కించుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌ల్లో శతకాలు సాధించిన వోల్వార్ట్.. కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్‌తో స్మృతి మంధానను వెనక్కి నెట్టి టాప్ ప్లేస్‌ను పదిలపర్చుకుంది. ఐర్లాండ్‌తో సిరీస్‌ను దక్షిణాఫ్రికా 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే.

**మన అమ్మాయిల హవా!**

భారత మహిళా జట్టులో మంచి పురోగతి కనిపిస్తోంది. శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన అరుంధతి రెడ్డి ఐదు స్థానాలు ఎగబాకి టీ20 బౌలర్లలో 36వ స్థానానికి చేరింది. బ్యాటర్ల విభాగంలో జెమిమా రోడ్రిగ్స్ ఐదు స్థానాలు మెరుగుపడి 9వ స్థానంలోకి దూసుకొచ్చింది. శ్రీలంకపై అజేయ అర్ధ శతకం సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన జెమీ.. టాప్-10లో చోటు దక్కించుకుంది.

చైతన్య రథం
సినిమా
బుధవారం 24 డిసెంబర్ 2025


# ఎట్టకేలకు శివాజీ సారీ..

నటుడు శివాజీ క్షమాపణలు చెప్పారు. మంచి మాటలు చెప్పే ఉద్దేశంలో రెండు అసభ్య పదాలు దొర్లాయని, వాటివల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలన్నారు. హీరోయిన్ల అందం వాళ్లు వేసుకునే దుస్తుల్లోనే ఉంటుందం టూ ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదిక వీడియో విడుదల చేశారు. "ఇటీవల పలువురు హీరోయిన్లు ఇబ్బంది పడిన సందర్భాన్ని ఉద్దేశిస్తూ 'దండోరా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాలుగు మంచి మాటలు చెబుతూనే రెండు అసభ్య పదాలు ఉపయోగించా. వాటివల్ల ఎవరికైనా మనోభావాలు దెబ్బతింటాయి. నేను మాట్లాడింది అమ్మాయిలందరినీ ఉద్దేశించి కాదు. 'బయటకు వెళ్లినప్పుడు మంచి దుస్తులు వేసుకుని ఉంటే మీకు ఈ ఇబ్బంది ఉండేది కాదేమోనమ్మా' అనే ఉద్దేశం తప్ప, ఎవరినీ అవమాన పర్చాల నీ కాదు. ఏదైనా రెండు అసభ్య పదాలు దొర్లాయి. అందుకు మనస్ఫూర్తిగా క్షమా పణలు చెబుతున్నా. నా మాటలతో ఇండ స్ట్రీలో మహిళల మనోభావాలు దెబ్బతిని ఉంటే మీ అందరికీ మరోసారి క్షమా పణలు" అంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. నటుడు శివాజీ వ్యాఖ్యలపై



తెలుగు సినీ ఇండస్ట్రీలో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేయడంతో.. దుమా రం లేచింది.మరోవైపు తెలంగాణ మహిళా కమిషన్ సైతం శివాజీ వ్యాఖ్యలను సీరి యస్‌గా తీసుకుంటూనోటీసులు పంపింది. ఈనెల 27న ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరవ్వాలని ఆదేశించింది. ఇంతకీ శివాజీ ఏమన్నారంటే.. "నటీమణులు డ్రెస్ సెన్స్ పాటించాలి. మీ అందం మొత్తం నిండుగా వేసుకొనే దుస్తుల్లోనే ఉంటుంది. ఫ్యాషన్ దుస్తులు వేసుకున్నప్పుడు అందరూ బాగున్నాయనే అంటారు. కానీ, లోపల తిట్టుకుంటారు. గ్లామర్‌కు హద్దుండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు. ప్రపంచ వేదికలపై కూడా చీర కట్టులో వచ్చినవారికే విశ్వసుందరి కిరీటాలు వచ్చాయి" అని వ్యాఖ్యానించారు.

# 'రాజుగారి పెళ్లిరో..'



నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి కీలక పాత్రల్లో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'రాజుగారి పెళ్లిరో' అంటూ సాగే పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు. ఈ సినిమాకి మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్నారు.

# అదే సమస్యగా మారింది!

నాజూకు విషయంలో అశ్రద్ధగా ఉండటంతో పెద్ద ప్రాజెక్ట్ కోల్పోయానని బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే చెబుతున్నారు. ఆమె కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా మాట్లాడుతూ.. "నేను ఎప్పుడైనా బరువు పెరిగితే బాధగా ఉంటుంది. హెచ్చుతగ్గుల కారణంగా శారీరకంగా ఎన్నో సమస్యలు. నేనేమీ అబద్ధం చెప్పడం లేదు. బరువు పెరిగానని అనిపించినప్పుడల్లా త్వరగా తగ్గేయాలన్న ఆలోచన వచ్చేస్తుంది. బరువు పెరగడంవల్ల నాపై ప్రభావం చూపి.. థెరపీ తీసుకోవాల్సి వస్తోంది" అన్నారు. "కొన్ని రోజుల కిందట పెద్ద సినిమాలో అవకాశం వచ్చింది. నేను నటిస్తాననే ఉద్దేశంతోనే నా కోసం ఆ పాత్రను



తీర్చిదిద్దారు. ఆ సమయంలో నేను లండన్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్నా. కొన్ని రోజులు విహారయాత్రకు వెళ్లి వచ్చాక షూటింగుకు వస్తానని చెప్పా. నేను ఇక్కడకు వచ్చేసరికి కాస్త బరువు పెరిగాను. నా వయసును పరిగణనలోకి తీసుకుంటే మెటబాలిజం సమర్థంగా పనిచేస్తుంది. షూటింగ్‌కు మరో నాలుగైదు నెలలు పడుతుందని అనుకున్నా. నేను విహారయాత్రనుంచి రాగానే వాళ్లు షూటింగ్ మొదలు పెట్టేశారు. నాతో చర్చించి నా పాత్రకు సంబంధించిన ఫొటో షూట్ చేశారు. తీరా చూస్తే, కాస్త బొద్దుగా కనిపించా. దాంతో ప్రాజెక్ట్ నుంచి తీసేశారు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇద్దరు కొత్త నటులను వారు పరిచయం చేశారు. వారి జీవితమే మారిపోయింది. ఇంతకీ నేను పెరిగిన బరువు ఎంతో తెలుసా? 3-4 కిలోలు మాత్రమే. ఒకవేళ ఆ సినిమా నేను చేసి ఉంటే నా కెరీర్ మరోలా ఉండేది" అని రాధికా స్పష్టం చేశారు.


# టీజర్‌తో ఆకట్టుకున్న సిగ్మా

సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోన్న చిత్రం 'సిగ్మా'. ఈ సినిమాతో కథానాయకుడు దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం కానున్న సంగతి తెలిసిందే. మంగళ వారం చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. విభిన్నమైన యాక్షన్ కామెడీ అడ్వెంచర్‌గా మూవీని తీర్చిదిద్దుతు న్నట్టు ప్రచార చిత్రం చూస్తే అర్థమవు తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది వేసవి కి తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. చిత్రానికి తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# చెవికోసి.. గ్లాసులో పెట్టాడు!

విలక్షణమైన సినిమాలను తెరకెక్కించి ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు రవిబాబు.. మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమయ్యారు. కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేస్తూ వదిలిన పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఓ గ్లాస్‌లో చెవిని కోసి అందులో వేసిన పోస్టర్‌తో ఇది క్రైమ్ థ్రిల్లర్ చిత్రమని చెప్పకనే చెబుతున్నారు రవిబాబు. ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేసి బ్లాక్‌బస్టర్ అందుకున్న హిస్టరీ రవిబాబుకి ఉంది. దీంతో ఇప్పుడు కేవలం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల్లో అంచనాలు రేకెత్తిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను నేటి ఉదయం 10.30 గంటలకు రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సినిమాను సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తోంది. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.




## జైలర్-2లో నన్ను ఎంజాయ్ చేస్తారు

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ప్రెస్టీజియస్ క్రేజీ సీక్వెల్ 'జైలర్-2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్ట్ చేస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో పలు క్రేజీ కేమియోలు ఉండనున్నాయి. తొలి భాగంలో కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, మలయాళ స్టార్ మోహన్‌లాల్ కేమియో పాత్రల్లో నటించి అదరగొట్టారు. అయితే, ఈ సీక్వెల్ మూవీలోనూ తన పాత్ర అద్భుతంగా ఉండబోతుందని శివరాజ్‌కుమార్ తెలిపారు. తన పాత్రపై ఆయన స్పందిస్తూ, తొలి భాగంలోకంటే ఈ సినిమాలో తన పాత్ర నిడివి ఎక్కువగా ఉండబోతుందని, ప్రేక్షకులు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారని తెలిపారు. ఇక ఈ సినిమాలో రమ్యకృష్ణ, జాకీష్రాఫ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తుండగా అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.



# మహేష్.. వీరవిహారమేనట

స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రెస్టీజియస్ గ్లోబ్ ట్రాటర్ చిత్రం 'వారణాసి' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాతో మహేష్‌బాబు గ్లోబల్‌స్థాయిలో సత్తా చాటుతాడన్న అంచనాలూ ఉన్నాయి. ఈ సినిమాలో మహేష్ రుద్ర పాత్రలో చేయబోయే వీరవిహారం ఎలా ఉంటుందో మూవీ టైటిల్ గ్లింప్స్‌తో పరిచయం చేశారు. అయితే, ఈ వారణాసి సినిమా కోసం మహేష్ యుద్ధవిద్యను నేర్చుకున్నాడు. ఆయనకు ఈ యుద్ధవిద్యలో శిక్షణనిచ్చింది హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ. మహేష్‌బాబుకి కలరిపయట్టులో శిక్షణ ఇచ్చినట్లు స్వయంగా ఆయనే చెప్పుకున్నారు. ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టులో మహేష్ గత ఏడాదిలోనే శిక్షణ తీసుకున్నాడని.. అయితే, ఈ విషయాన్ని సమయం వచ్చేవరకు ఎవరికీ చెప్పకూడదని చిత్ర యూనిట్ తనను కోరినట్టు హరికృష్ణ తెలిపారు. మహేష్ బాబుకంటే తాను చిన్నవాడినని.. అయినా, తనకు ఆయనిచ్చే మర్యాద ఎప్పటికీ మర్చిపోలేనిదని హరికృష్ణ తెలిపారు. ఈ విద్యను అభ్యసించిన వారు శారీరకంగా, మానసికంగా పవర్‌ఫుల్‌గా ఉంటారని ఆయన తెలిపారు. తాజాగా ఇంగ్లీష్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హరికృష్ణ ఈ విషయాలను పంచుకున్నారు. ఇక వారణాసిలో మహేష్ చేయబోయే యాక్షన్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో ఊహించవచ్చు. సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

